బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ | ఆదివారం జూన్ 21 2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## హర్మూజ్ జలసంధి మళ్లీ మూసివేత.. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు

**ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా ఇరాన్ నిర్ణయం**

**అంతర్జాతీయ చమురు మార్కెట్లలో ఆందోళన**

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడులకు ప్రతిస్పందనగా ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ నిర్ణయంతో అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో ఆందోళన వ్యక్తమవుతోంది.ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తూ లెబనాన్‌పై నిరంతర దాడులకు పాల్పడుతోందని ఇరాన్ ఆరోపించింది. శనివారం తెల్లవారుజాము నుంచి జరిగిన దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు లెబనాన్ మీడియా సంస్థలు వెల్లడించాయి.ఈ పరిణామాల నేపథ్యంలో హర్మూజ్ జలసంధిపై పూర్తి నియంత్రణను తిరిగి చేపట్టినట్లు ఇరాన్ సైనిక వర్గాలు ప్రకటించాయి. ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు మిగితా 2వ పేజీలో

# రాష్ట్రంలో 25 నుంచి సర్



- **ఓటర్ల జాబితాలో తప్పులు, తేడాలు ఉన్న 89.88 లక్షల మందికి నోటీసులు ఇస్తాం**
- **అనర్హులను తొలగించి అర్హులకు ఓటు హక్కు కల్పించడమే 'సర్' ఉద్దేశం**
- **ఓటర్ల తొలగింపు కాదు.. జాబితా ప్రక్షాళనే లక్ష్యం**
- **మీడియా సమావేశంలో సీఈవో సుదర్శన్‌రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో చేపట్టనున్న ఓటరు జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ ప్రధాన ఉద్దేశం ఓటర్లను తొలగించడం కాదని, ఓటరు జాబితాను ప్రక్షాళన చేసి అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమేనని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీ సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఆయన తెలిపిన వివరాల ప్రకారం, రాష్ట్రంలో గత 24 సంవత్సరాలుగా ఓటరు జాబితాల సమగ్ర శుద్ధి జరగలేదు. ఈ కాలంలో మరణించినవారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, డూప్లికేట్ నమోదులు వంటి అంశాలను గుర్తించి సరిచేయడం ఈ ప్రక్రియ ప్రధాన లక్ష్యమని వివరించారు.

జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే

జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారు.

ప్రతి ఓటరుకు రెండు ఫారాలు అందజేస్తారు.

ఒక ప్రతిని ఓటరు వద్ద ఉంచుకొని, మరొకదాన్ని బీఎల్‌వోకు అందజేయాలి.

ప్రస్తుతం ఓటరు జాబితాలో నమోదైన చిరునామాకే ఫారాలు పంపిణీ చేస్తారు.

**రాష్ట్రంలో 70.54 శాతం మ్యాపింగ్**

రాష్ట్రంలో ఇప్పటివరకు 70.54 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తయిందని, ఇంకా సుమారు కోటి మంది ఓటర్ల వివరాల మ్యాపింగ్ జరగాల్సి ఉందని అధికారులు వెల్లడించారు.

**48 వేల మంది బీఎల్‌వోలు**

ఈ భారీ కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 48 వేల మంది బూత్ స్థాయి అధికారులను నియమించారు.

**89.88 లక్షల ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలు**

క్షేత్రస్థాయి పరిశీలనలో సుమారు 89.88 లక్షల మంది ఓటర్ల వివరాల్లో కొన్ని లోపాలు గుర్తించినట్లు సీఈవో తెలిపారు. వాటిలో:

వయస్సు వివరాల్లో తేడాలు

తల్లిదండ్రులు, భార్యాభర్తల పేర్లలో పొరపాట్లు

పాత, కొత్త రికార్డుల మధ్య వ్యత్యాసాలు

ఆధార్ మాత్రమే ఉండటం

తగిన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం

వంటి 11 రకాల లోపాలను గుర్తించారు.

**నోటీసులు అందుకున్న వారు ఏమి చేయాలి?**

వివరాల్లో లోపాలు ఉన్న వారికి నోటీసులు జారీ చేస్తారు. వారు పుట్టిన తేదీ, పుట్టిన స్థలం, తల్లిదండ్రుల వివరాలను నిరూపించే పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

1987 జూలై 1కు ముందు జన్మించిన వారు తమ పుట్టిన తేదీ లేదా పుట్టిన స్థలాన్ని నిరూపించే ఒక పత్రం సమర్పించాలి.

1987 జూలై 1 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లి లేదా తండ్రి ధ్రువీకరణ పత్రాలను కూడా సమర్పించాల్సి ఉంటుంది.

**ముఖ్యమైన తేదీలు**

| తేదీ | కార్యక్రమం |
|---|---|
| జూన్ 25 -- జూలై 24 | ఇంటింటి సర్వే, ఫారాల పంపిణీ |
| జూలై 31 | ప్రాథమిక ఓటరు జాబితా విడుదల |
| జూలై 31 -- ఆగస్టు 30 | అభ్యంతరాలు, క్లెయిమ్‌లు |
| అక్టోబర్ 1 | తుది ఓటరు జాబితా విడుదల |

సీఈవో స్పష్టీకరణ

సర్ ప్రక్రియకు ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవని, కులం లేదా మతం ఆధారంగా ఎవరి ఓట్లు తొలగించబోరని సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి పౌరుడికి సమానంగా ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.



## రైల్వే మంత్రితో సమావేశం ఏర్పాటు చేయండి

**కంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ..**

**హైదరాబాద్ మెట్రో పెండింగ్ అంశాల పరిష్కారానికి కేంద్ర జోక్యం కోరిన సీఎం రేవంత్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టు, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) రుణానికి సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశారు. ఈ నెల 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలో ఉండనున్న నేపథ్యంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి మెట్రో రైలు అత్యంత కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అంశాలపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని లేఖలో వివరించారు. సమావేశం ఏర్పాటు చేస్తే అవసరమైన పత్రాలతో హాజరవుతానని తెలిపారు. ఇప్పటికే జూన్ 17న కూడా ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి బహిరంగ లేఖ రాసి, ఐఆర్ఎఫ్‌సీ రుణం విడుదలతో పాటు హైదరాబాద్ మెట్రో రెండో దశకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మెట్రో విస్తరణ, రుణ అంశాలపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

అయితే హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందంటూ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఖండించారు. దేశంలోని ఇతర మెట్రో ప్రాజెక్టులకు అందిస్తున్న విధంగానే హైదరాబాద్ మెట్రోకు కూడా కేంద్రం సహకరిస్తోందని ఆయన స్పష్టం చేశారు. సాంకేతిక, ఆర్థిక అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తేనే ప్రాజెక్టులు సాఫల్యం సాధిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన మెట్రో రెండో దశ-ఏలో ఐదు కారిడార్ల ద్వారా 76.4 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణను చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.24,269 కోట్లుగా నిర్ణయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.7,313 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.4,230 కోట్లు, రుణాల ద్వారా రూ.11,693 కోట్లు, పీపీపీ విధానంలో రూ.1,033 కోట్లు సమకూరనున్నాయి. ఈ దశలో నాగోల్--శంషాబాద్ ఎయిర్‌పోర్టు, రాయదుర్గం--కోకాపేట్ నియోపోలిస్, ఎంజీబీఎస్--చాంద్రాయణగుట్ట, మియాపూర్--పటాన్‌చెరు, ఎల్‌బీనగర్--హయత్‌నగర్ కారిడార్లు ప్రతిపాదించారు. రెండో దశ-బీలో 86.1 కిలోమీటర్ల మేర మూడు కొత్త కారిడార్లను రూ.19,579 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు--ఫ్యూచర్ సిటీ, జేబీఎస్--మేడ్చల్, జేబీఎస్--షామీర్‌పేట్ మార్గాలను ఇందులో అభివృద్ధి చేయనున్నారు. ఇదిలా ఉండగా, హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టు ఆలస్యానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బాధ్యత వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించగా, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వం అసత్య ఆరోపణలు చేస్తోందని కేటీఆర్ ప్రతిస్పందించారు.

## పంటల కొనుగోలు నిలిపివేత
## నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాటం



- **బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
- **రైతుల పంటలను కొనుగోలు చేయబోమన్న ప్రభుత్వ నిర్ణయంపె ఆగ్రహం**
- **బోథ్ నియోజకవర్గ సమావేశంలో ప్రభుత్వంపై విమర్శలు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం రైతుల పంటలను కొనుగోలు చేయబోమన్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకునే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. బోథ్ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతాంగానికి తీవ్ర నష్టం కలిగించే నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందని ఆరోపించారు. కేవలం 15 రోజుల క్రితం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు మాట మార్చారని కేటీఆర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కోటా మేరకే పంటలను కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం రైతులకు శాపంగా మారుతుందని అన్నారు.

రైతులు పండించే వరి, జొన్నలు, శనగలు, కందులు, సోయాబీన్ వంటి పంటలను కూడా కొనుగోలు చేయబోమన్న ప్రభుత్వ వైఖరి ఆందోళన కలిగిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంత కొనుగోలు చేస్తే అంతే కొనుగోలు చేస్తామని చెప్పడం వల్ల రైతులు తమ పంటను తక్కువ ధరలకు బహిరంగ మార్కెట్లో విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పండిన ప్రతి గింజను కొనుగోలు చేశామని, కేంద్రం వడ్లు కొనుగోలు చేయబోమన్న సమయంలో కేసీఆర్ నాయకత్వంలో ఢిల్లీకి వెళ్లి పోరాటం చేసి కేంద్రాన్ని ఒప్పించామని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు కూడా తమ బాధ్యతను గుర్తించి రైతుల ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు.

రైతులు కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని, ప్రకటించిన బోనస్, కొనుగోలు కేంద్రాల హామీలపై ప్రశ్నించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ అసమర్థత కారణంగానే రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆరోపించారు.

రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ, సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ మిగితా 2వ పేజీలో



## భారత్‌కు అనుకూల ప్రయోజనాలు లభించినప్పుడే
## అమెరికాతో వాణిజ్య ఒప్పందం

**కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్**

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

భారత్‌కు పోటీ దేశాలతో పోలిస్తే మెరుగైన వాణిజ్య ప్రయోజనాలు లభించినప్పుడే అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) అమల్లోకి వస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య కొనసాగుతున్న చర్చల్లో టారిఫ్ అంశాలే ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని వెల్లడించారు.బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్ ఇప్పటికే ఖరారైందని, దానిని రెండు దేశాలు కూడా ప్రకటించాయని తెలిపారు. అయితే అమెరికా సుప్రీంకోర్టు టారిఫ్‌లకు సంబంధించి ఇచ్చిన తీర్పు నేపథ్యంలో కొన్ని అంశాలు మళ్లీ చర్చకు వచ్చాయని పేర్కొన్నారు.పోటీ దేశాలతో పోలిస్తే భారత ఉత్పత్తులకు అమెరికా మార్కెట్లో తక్కువ సుంకాలతో మెరుగైన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని గోయల్ స్పష్టం చేశారు. ఆ అంశం పరిష్కారమైతేనే వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. భారత ప్రయోజనాలను కాపాడే విధంగానే కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు.కొంతకాలంగా భారత్, అమెరికా దేశాలు ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు చర్చలు కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా రాయబారి చేసిన వ్యాఖ్యలపై స్పందించిన గోయల్, మిగితా 2వ పేజీలో

## సింగరేణి బొగ్గు కుంభకోణాన్ని దాచేందుకే
## కిషన్ రెడ్డిపై రేవంత్ రెడ్డి అసత్య ప్రచారాలు



- **రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో కుప్పకూలుతున్న ప్రభుత్వ విద్యావ్యవస్థ**
- **ఓయూకి రూ.1000 కోట్ల హామీ అమలు ఏమైంది?**
- **45 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయం వెనుక ఉన్న దొంగలెవరో తేల్చాలి.**
- **బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఫైర్.**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న భారీ సింగరేణి బొగ్గు కుంభకోణాన్ని దాచిపెట్టడంతో పాటు ఈ అవినీతిపై నిజాలు బయటకు రాకుండా అణిచివేయడానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గారిపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు గారు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మైనింగ్, ఎక్స్పోర్ట్స్, వేస్ట్ ఎనర్జీ రంగాల్లో ప్రముఖ పారిశ్రామికవేత్తగా దేశ ప్రగతికి తోడ్పడుతున్న ఫణి కుమార్ గారు.. ప్రధాని నరేంద్ర మోదీ గారి పాలన, నాయకత్వం పట్ల ఆకర్షితులై బీజేపీ ప్రాథమిక సభ్యత్వం తీసుకున్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు గారు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

సింగరేణి కాలరీస్ మైన్స్ పరిధిలో దాదాపు 45 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందని పేపర్లలో వార్తలు రావడంపై నిజానిజాలు తెలుసుకోవడానికి మా పార్టీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి గారు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం ఫ్యాక్ట్ ఫైండింగ్ కోసం వెళ్తే రేవంత్ ప్రభుత్వం పోలీసులతో అడ్డుకుందని రాంచందర్ రావు గారు మండిపడ్డారు. సింగరేణిలో 51 శాతం వాటా రాష్ట్ర ప్రభుత్వానిది, 49 శాతం వాటా మిగితా 2వ పేజీలో

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరు

- **రైతు డిక్లరేషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడిచింది**
- **నిరంజన్‌రెడ్డి**
- **రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది: గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రైతు డిక్లరేషన్‌కు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా ఉరివేసినట్టైందని వ్యాఖ్యానించారు. రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో వడ్ల కొనుగోలు, యూరియా పంపిణీ, రైతు భరోసా, రైతు బీమా వంటి అంశాల్లో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.2020లో బీఆర్ఎస్ ప్రభుత్వం గరిష్ఠంగా 92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన సమయంలో పంటల మార్పిడిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేకపోతోందని విమర్శించారు. యాసంగి ధాన్యానికి ఇప్పటివరకు బోనస్ ఇవ్వలేదని, గతంలో 33 రకాల సన్న వడ్లకు బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు కేవలం ఏడు రకాల వడ్లకే బోనస్ పరిమితం చేయడం రైతులను మోసం చేయడమేనని పేర్కొన్నారు.

మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమని అన్నారు. రైతు పండించిన పంటను ప్రభుత్వాలు కొనుగోలు చేయాల్సిన బాధ్యత ఉందని, కేంద్రం మిగితా 2వ పేజీలో



## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసే వరకు ఉద్యమం

**సీజేపీ నేత అభిజీత్ దీప్కే స్పష్టం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశవ్యాప్తంగా నీట్ సహా వివిధ ప్రవేశ, నియామక పరీక్షల్లో చోటుచేసుకుంటున్న అవకతవకలు, పేపర్ లీకేజీలు, నియామక ప్రక్రియల్లో జాప్యాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమం ఉత్కంఠ రేపుతోంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకు తాను జంతర్‌మంతర్‌ను విడిచిపెట్టబోనని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. దేశం నలుమూలల నుంచి విద్యార్థులు, ఉద్యోగార్థులు, యువత పెద్ద సంఖ్యలో ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పరీక్షల నిర్వహణలో లోపాలు, పేపర్ లీకేజీలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మాట్లాడుతూ

## నీట్ రీ-ఎగ్జామ్‌కు పటిష్ఠ భద్రత

**దేశవ్యాప్తంగా మాక్‌డ్రిల్ నిర్వహించిన ఎన్‌టీఏ**

**1.38 లక్షల ఏఐ సీసీటీవీలు, 51 వేల సిగ్నల్ జామర్లు ఏర్పాటు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)లో గతంలో చోటుచేసుకున్న అవకతవకలు, పేపర్ లీకేజీల వంటి ఘటనలు పునరావృతం కాకుండా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టింది. ఆదివారం నిర్వహించనున్న నీట్ రీ-ఎగ్జామ్‌కు ముందు శనివారం చెన్నైతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించింది.

ప్రశ్నాపత్రాల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, ఎస్కార్ట్ భద్రతతో పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాల రవాణా, పరీక్ష అనంతరం సమాధాన పత్రాల సేకరణ వంటి ప్రక్రియలను అధికారులు పరిశీలించారు. పరీక్షా కేంద్రాలన్నింటినీ సీసీటీవీ నిఘా పరిధిలోకి తీసుకొచ్చారు.

**విద్యార్థులకు కీలక సూచనలు**

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే పరీక్ష సాయంత్రం 5.15 గంటలకు ముగియనుంది.

అభ్యర్థులు అడ్మిట్ కార్డుతో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఒరిజినల్ గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను తప్పనిసరిగా తీసుకురావాలని ఎన్‌టీఏ సూచించింది. హాఫ్ స్లీవ్ దుస్తులు, సాధారణ ప్యాంట్లు, స్లిప్పర్లు లేదా తక్కువ హీల్స్ ఉన్న పాదరక్షలను మాత్రమే అనుమతిస్తారు.

మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, భారీ ఆభరణాలు, పెద్ద బెల్ట్ బకిల్స్ వంటి వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు.

నీట్-యూజీ 2026 పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో నిర్వహిస్తున్న ఈ రీ-ఎగ్జామ్‌కు మిగితా 2వ పేజీలో

## హర్మ్యూజ్ జలసంధి మళ్లీ మూసివేత.. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు

(మొదటి పేజీ తరువాయి)

ఐదో వంతు, భారీ స్థాయిలో సహజ వాయువు రవాణా ఈ జలసంధి ద్వారానే జరుగుతుండటంతో ఇరాన్ నిర్ణయం ప్రపంచ ఇంధన రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్‌పై ఆంక్షల సడలింపు, అణు చర్చల అంశాలపై స్విట్జర్లాండ్‌లో జరగనున్న దౌత్య చర్చల నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. హర్మ్యూజ్ జలసంధి మూసివేత నిర్ణయం ఆ చర్చలపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇరాన్ చర్య ఆమోదయోగ్యం కాదని వైట్‌హౌస్ స్పందించింది. అయినప్పటికీ, దౌత్యపరమైన చర్చలను కొనసాగించేందుకు ప్రయత్నిస్తామని అమెరికా ప్రకటించింది. మధ్యప్రాచ్య ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### సింగరేణి బొగ్గు కుంభకోణాన్ని దాచేందుకే

## కిషన్ రెడ్డిపై రేవంత్ రెడ్డి అసత్య ప్రచారాలు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వానిది అయినప్పటికీ... కేంద్ర ప్రభుత్వానికి అక్కడ కనీసం ఒక అటెండర్‌ను నియమించే లేదా బదిలీ చేసే అడ్మినిస్ట్రేటివ్, ఫైనాన్షియల్ అధికారాలు లేవని స్పష్టం చేశారు. పూర్తి అధికారాలు రాష్ట్ర ప్రభుత్వం చేతిలోనే ఉన్నాయని, అందుకే కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి గారు బాధ్యతాయుతంగా ఈ కుంభకోణంపై విచారణ జరిపించాలని సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారని తెలిపారు. తప్పు చేయనప్పుడు బీజేపీ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని ఎందుకు అడ్డుకున్నారని, ఈ బొగ్గు దొంగతనం వెనుక ఉన్న అసలు దొంగలెవరో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో "నో అడ్మిషన్" బోర్డులు పెట్టాల్సి వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి గారు గొప్పగా చెప్పుకోవడం అత్యంత హాస్యాస్పదమని రాంచందర్ రావు గారు పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేస్తే, ప్రస్తుత రేవంత్ ప్రభుత్వం దాన్ని పూర్తిగా చంపేస్తోందని విమర్శించారు. రేషనలైజేషన్ పేరిట స్కూళ్లను తగ్గించి, ఇప్పుడు మూసివేత దిశగా తీసుకెళ్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 90 శాతానికి పైగా ప్రభుత్వ పాఠశాలలు కూలిపోయే స్థితిలో ఉన్నాయని, విద్యార్థినులకు ప్రత్యేక టాయిలెట్లు, కనీస మౌలిక వసతులు లేవని మండిపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల కావస్తున్నా ఇప్పటివరకు కొత్త పాఠ్యపుస్తకాలు ప్రింట్ కాలేదని, యూనిఫారాలు అందలేదని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కేంద్రీయ విద్యాలయాలకు ఉన్న డిమాండ్, స్టాండర్డ్స్ మన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలకు ఎందుకు లేవని ప్రశ్నించారు. టీచర్లకు సరైన ప్రమోషన్లు లేవు, చాలా జిల్లాల్లో ఐజుఉలు, వీజుఉలు సరిగ్గా లేరని.. కేవలం జీతాలకే సరిపోయే బడ్జెట్ కాకుండా విద్యాశాఖకు బడ్జెట్‌ను తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చి, నాడు ప్రకటించిన రూ.1000 కోట్ల నిధుల హామీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఓయూలో హాస్టళ్ల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని, 'బి' హాస్టల్ ఇప్పటికే మూతపడగా, 'డి', 'ఇ' హాస్టళ్లు కూడా కూలిపోయే స్థితికి చేరాయని ఆందోళన వ్యక్తం చేశారు. మెస్‌లలో క్వాలిటీ లేదని, విద్యార్థుల సమస్యలపై, హక్కులపై మాట్లాడే ప్రొఫెసర్లను సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల హాస్టళ్లను తక్షణమే పునర్నిర్మించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు.

మరోవైపు రాహుల్ గాంధీ ప్రధానమంత్రిని చేస్తే ధాన్యం కొనుగోలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం రైతులను వంచించడమేనని దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యేది లేదు, రేవంత్ రెడ్డి ధాన్యం కొనేది లేదన్నట్లుగా ఉందని, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ హయాంలోనే ఎమర్జెన్సీ విధించి నియంత పాలన సాగించారని, వాళ్ల సొంత పార్టీలు ముక్కలైన చరిత్ర కాంగ్రెస్‌దని.. ప్రాంతీయ పార్టీలను విచ్ఛిన్నం చేస్తోందంటూ బీజేపీపై బురదజల్లడం సరికాదన్నారు. ఇప్పటికైనా హామీలకే పరిమితం కాకుండా విద్యావ్యవస్థను కాపాడాలని, రైతులకు తక్షణ న్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా దేశాభివృద్ధి కోసం యువత, మహిళలు, విద్యావంతులు భారీగా బీజేపీలో చేరి నరేంద్ర మోదీ గారి నాయకత్వాన్ని మరింత బలపరచాలని పిలుపునిచ్చారు

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరు

(మొదటి పేజీ తరువాయి)

ఎంత కొనుగోలు చేస్తే అంతే కొంటామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం సరికాదని విమర్శించారు. రైతులు తమకు నచ్చిన పంటను పండించే హక్కు రాజ్యాంగం కల్పించిందని, ఆ పంటలను కొనుగోలు చేయడం ప్రభుత్వాల బాధ్యత అని స్పష్టం చేశారు. రైతుల పంటలను పూర్తిగా కొనుగోలు చేసే వరకు బీఆర్ఎస్ రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ సీజన్‌కు ముందే వ్యవసాయ రంగంపై సమీక్షలు నిర్వహించి రైతులకు అవసరమైన మార్గదర్శకాలు అందించేవారని తెలిపారు. రైతుబంధు, రైతు బీమా, పెట్టుబడి సాయం వంటి కార్యక్రమాల ద్వారా రైతులను ఆదుకున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు.

రాష్ట్రంలో రైతు భరోసా సక్రమంగా అమలు కావడం లేదని, జనగాం నియోజకవర్గంలో మరణించిన రైతు కుటుంబాలకు రైతు బీమా అందలేదని ఆరోపించారు. రైతులకు యూరియాను సకాలంలో అందించడంలో కూడా ప్రభుత్వం విఫలమైందన్నారు.వ్యవసాయ శాఖ మంత్రి పూర్తిగా విఫలమయ్యారని, రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను విస్మరించిన ప్రభుత్వానికి రైతులు తగిన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రైతాంగానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని, రైతుల హక్కుల కోసం పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

## నీట్ రీ-ఎగ్జామ్‌కు పటిష్ఠ భద్రత

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా అపూర్వమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షకు సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

దేశవ్యాప్తంగా 551 నగరాల్లో 5,440 పరీక్షా కేంద్రాలు, విదేశాల్లో 14 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్రమాలకు ఆస్కారం లేకుండా 1.38 లక్షల ఏఐ ఆధారిత సీసీటీవీ కెమెరాలు, 51 వేల సిగ్నల్ జామర్లు, రెట్టింపు బయోమెట్రిక్ ధృవీకరణ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలో సగటున 40 నుంచి 50 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు.

**పేపర్ లీక్ కేసుపై విచారణ కొనసాగింపు**

మే 3న నిర్వహించిన అసలు పరీక్షలో రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల్లోని కోచింగ్ కేంద్రాల ద్వారా "గెస్ పేపర్" పేరుతో ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ అనుమతితో ఎన్‌టీఏ పరీక్షను రద్దు చేసి, కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. ఈ కేసులో పలువురిని అరెస్ట్ చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షకు సంబంధించిన పిటిషన్ల విచారణను సుప్రీంకోర్టు జులైకి వాయిదా వేయడంతో రీ-ఎగ్జామ్ నిర్వహణకు మార్గం సుగమమైంది. వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ఎన్‌టీఏ విద్యార్థులకు సూచించింది.




## హైడ్రాపై దుష్ప్రచారం జరుగుతోంది

### కమిషనర్ ఏవీ రంగనాథ్

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలోని అక్రమ నిర్మాణాలు, చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్న హైడ్రాపై కొందరు ఉద్దేశపూర్వకంగా వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ూా ఎ క్ష్మ్రుఅస్త్రుఖ్ష్ట్ర ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన సంస్థ పనితీరు, చర్యలపై వివరాలు వెల్లడించారు.

హైడ్రా కేవలం కూల్చివేతల సంస్థ కాదని, ఇప్పటివరకు నగరంలో దాదాపు 600 ఆపరేషన్లు నిర్వహించి ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులను రక్షించామని తెలిపారు. సుమారు రూ.1.10 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను ఆక్రమణల నుంచి కాపాడినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని, రాజకీయ పార్టీలతో తమకు ఎలాంటి సంబంధం లేదని రంగనాథ్ స్పష్టం చేశారు.

'ఎంఐఎం అయినా, అధికార కాంగ్రెస్ అయినా మాకు ఒకటే. చట్టం అందరికీ సమానంగా అమలవుతుంది" అని ఆయన పేర్కొన్నారు. నగరంలోని విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు, ఇతర నిర్మాణాల విషయంలో కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారిలో నిజమైన పేదలను గుర్తించి, వారికి ప్రభుత్వం తరపున డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుపై చర్యలు తీసుకున్న తర్వాతే తదుపరి నిర్ణయాలు ఉంటాయని చెప్పారు.

ఇటీవల హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాలకు నగరం అతలాకుతలం కావడానికి నాలాల ఆక్రమణలు, చెరువుల పూడికలే ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం తీసుకునే చర్యల వల్ల కొంతమంది ఆక్రమణదారులు నష్టపోవడం తప్పదన్నారు. హైడ్రా వైపు ఏవైనా పొరపాట్లు జరిగితే క్షమాపణ చెప్పడానికి కూడా సిద్ధమని, అవసరమైతే వాటిని సరిదిద్దుకుంటామని రంగనాథ్ తెలిపారు. అయితే హైడ్రా రాజకీయ సెటిల్‌మెంట్లకు వేదికగా మారదని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలతో హైడ్రా చర్యలు, నగరంలోని ఆక్రమణల అంశం మరోసారి ప్రజా చర్చకు వచ్చింది.

# పీఎం-కిసాన్ 23వ విడత నిధులు విడుదల

**9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున జమ**

**రూ.18,880 కోట్లను విడుదల చేసిన ప్రధాని మోదీ**



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

లిలిహుగ్లీ, జూన్ 20:లిలి రైతులకు పెట్టుబడి సాయంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 23వ విడత నిధులను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన బంగాల్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో రూ.18,880 కోట్ల నిధులను విడుదల చేశారు.

ఈ విడతలో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున నేరుగా జమయ్యాయి. దీంతో రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో కేంద్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసిందని ప్రధాని పేర్కొన్నారు.

పీఎం-కిసాన్ నిధుల విడుదలతో పాటు రూ.590 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు కూడా ప్రధాని శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, ఎన్నికల అనంతరం ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం తరఫున తొలిసారిగా బంగాల్ ప్రజలను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య మార్పు స్పష్టంగా కనిపిస్తోందని, ప్రజల ముఖాల్లో నమ్మకం, ఆశావాదం కనిపిస్తోందని పేర్కొన్నారు.

భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో కంచె నిర్మాణ అంశాన్ని ప్రస్తావించిన ప్రధాని, గత ప్రభుత్వం ఈ ప్రక్రియకు ఆటంకాలు కల్పించిందని ఆరోపించారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఆ పనులను తిరిగి ప్రారంభించిందని తెలిపారు.

రాష్ట్రంలో అవినీతి, ప్రజా ధన దోపిడీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్, వామపక్షాలు, అనంతరం తృణమూల్ కాంగ్రెస్ పాలనలో బంగాల్ ఆశించిన అభివృద్ధిని సాధించలేకపోయిందని విమర్శించారు.

**శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలను స్మరించిన ప్రధాని**

దేశ విభజన సమయంలో బంగాల్‌లోని కొంత భాగం భారతదేశంలోనే కొనసాగేలా చేయడంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ కీలక పాత్ర పోషించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని నివాళులర్పించారు.

1947లో బంగాల్ మొత్తం పాకిస్థాన్‌లో కలిసిపోకుండా అడ్డుకోవడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. బంగాల్ ఆవిర్భావ దినోత్సవ ప్రాముఖ్యతను యువత అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాని అన్నారు. వలస పాలన కాలంలో బంగాల్ ఎన్నో కష్టాలను, త్యాగాలను ఎదుర్కొన్నదని తెలిపారు. అంతకుముందు రైల్వేలు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, మత్స్య, పశుసంవర్ధక రంగాలకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. బంగాల్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు.

### భారత్‌కు అనుకూల ప్రయోజనాలు లభించినప్పుడే

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

ఇంకా కొన్ని కీలక అంశాలు పరిష్కారం కావాల్సి ఉందని పేర్కొన్నారు.

**రూపాయి విలువపై ఆందోళన అవసరం లేదు**

ఇటీవల అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ క్షీణించడంపై స్పందించిన గోయల్, భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు బలంగా ఉన్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో రూపాయి విలువ మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోందని, ఆర్థిక బలం కారణంగా రూపాయి కూడా పుంజుకుంటుందని పేర్కొన్నారు.

38 దేశాలతో 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లలో భారత్ మొత్తం 38 దేశాలతో కలిసి 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుందని గోయల్ వెల్లడించారు. ఈ ఒప్పందాల ద్వారా భారత ఎగుమతులకు కొత్త మార్కెట్లు లభించాయని, విదేశీ పెట్టుబడులు కూడా పెరిగాయని తెలిపారు.

ఎరువుల ధరలు పెంచలేదు

వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావం గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, రైతులకు అవసరమైన మద్దతును ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. గత 12 ఏళ్లుగా ఎరువుల ధరలు పెరగకుండా కేంద్ర ప్రభుత్వం దాదాపు 90 శాతం వరకు సబ్సిడీ భారం భరిస్తోందని తెలిపారు.

రాబోయే కాలంలో కూడా అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగుతాయని, వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

### పంటల కొనుగోలు నిలిపివేత

## నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

వంటి కార్యక్రమాల ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుందని ఆయన పేర్కొన్నారు. దేశంలోనే ధాన్య ఉత్పత్తిలో తెలంగాణను అగ్రస్థానంలో నిలబెట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. రైతులను రాజులుగా నిలబెట్టిన కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలని, అందుకోసం పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు ప్రశాంత్ రెడ్డి, జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, పాడి కౌశిక్ రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జాన్సన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసే వరకు ఉద్యమం



(మొదటి పేజీ తరువాయి)

, దేశవ్యాప్తంగా వేలాది మంది యువత న్యాయం కోసం జంతర్‌మంతర్‌కు వచ్చారని తెలిపారు. తమ ఆందోళన పూర్తిగా శాంతియుతంగా కొనసాగుతోందని, అందువల్ల నిరసనకు అనుమతి గడువును పొడిగించాలని ఢిల్లీ పోలీసులను కోరినట్లు చెప్పారు. "మాకు న్యాయం జరిగే వరకు ఇక్కడే ఉండాలని భావిస్తున్నాం. మేము సాధారణ విద్యార్థులమే. ఎలాంటి హింసాత్మక చర్యలకు పాల్పడడం లేదు. కాబట్టి నిరసన కొనసాగించేందుకు అనుమతి ఇవ్వాలి" అని ఆయన పేర్కొన్నారు.

**అనుమతి పొడిగింపుకు నిరాకరణ**

జంతర్‌మంతర్ వద్ద నిరసనలకు ఇచ్చిన అనుమతి గడువు ముగియడంతో దానిని పొడిగించాలని సీజేపీ నాయకత్వం విజ్ఞప్తి చేసింది. అయితే ఢిల్లీ పోలీసులు ఈ అభ్యర్థనను తిరస్కరించి, నిరసనకారులు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని సూచించినట్లు సమాచారం.

అయినప్పటికీ, అభిజీత్ దీప్కే తన వైఖరిలో మార్పు లేదని స్పష్టం చేశారు. "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకు ఇక్కడి నుంచి కదలను" అని మరోసారి ప్రకటించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే తమ ఏకైక లక్ష్యమని చెప్పారు.

**చర్చలకు సిద్ధమే**

కేంద్ర ప్రభుత్వంతో చర్చలకు తాము సిద్ధమేనని, అయితే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసిన తర్వాతే చర్చలకు అర్థం ఉంటుందని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. అవసరమైతే ముందుగా తననే అరెస్టు చేయాలని, తాను కోర్టు అరెస్టుకు సిద్ధంగా ఉన్నానని ఢిల్లీ పోలీసులకు తెలిపారు.

నిరసనలకు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బహిరంగ లేఖ రాసిన ఆయన, పరీక్షల్లో అవకతవకలు, పేపర్ లీకేజీలపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

**వినూత్నంగా నిరసన**

దీప్కే పిలుపు మేరకు నిరసనకారులు తాళాలు, చెంచాలు మోగిస్తూ నిరసన తెలిపారు. "చెవిటివారికి వినిపించాలంటే శబ్దం పెద్దగా ఉండాలి" అనే నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. కొందరు నిరసనకారులు కాక్రోచ్ మాస్కులు ధరించి ఆకర్షణగా నిలిచారు. కేంద్ర విద్యాశాఖ మంత్రిని పదవి నుంచి తొలగించాలని నినాదాలు చేశారు. ఈ నిరసనలో పాల్గొన్న ఢిల్లీ హైకోర్టు న్యాయవాది దిల్షాద్ చౌదరి మాట్లాడుతూ, విద్యా వ్యవస్థలో ఎన్నో సంవత్సరాలుగా లోపాలు ఉన్నప్పటికీ, వరుస పేపర్ లీకేజీలు ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమయ్యాయని అన్నారు. "మేము ఎలాంటి రాజకీయ కారణాలతో ఇక్కడకు రాలేదు. వ్యవస్థ వైఫల్యాలతో తీవ్ర నిరాశకు గురైన విద్యార్థుల తరపున నిలబడుతున్నాం. ఈ పోరాటంలో వెంటనే విజయం సాధించకపోయినా, మా హక్కుల కోసం ఎవరో ఒకరు పోరాడారని భవిష్యత్ తరాలకు తెలియజేయడమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు.

## చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం

**అమిత్ షా వ్యాఖ్యలు:**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



కేంద్ర హోంమంత్రి ూాఎ్ ూష్ట్రుష్ట్ర శనివారం మహారాష్ట్రలోని ఖశీశ్రీష్ట్ఘుజూబతీలో నిర్వహించిన బహిరంగ సభలో కాంగ్రెస్, శివసేన (యూబీటీ)పై తీవ్ర విమర్శలు చేశారు. మహాలక్ష్మి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, భారత్ ధర్మసత్రం కాదని, దేశ పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉందని స్పష్టం చేశారు. అక్రమ చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుని రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు కాంగ్రెస్, ఖఃఒష్ట్ఘుజ ఒష్ట్ఘుఏఎవతీఘుఎ ప్రయత్నిస్తున్నారని అమిత్ షా ఆరోపించారు. దేశంలోని ప్రతి చొరబాటుదారుడిని గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకుని దేశం నుంచి పంపిస్తామని హెచ్చరించారు.

అమిత్ షా మాట్లాడుతూ, "ఈ దేశం ధర్మసత్రం కాదు. భారత పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంది. ప్రతి చొరబాటుదారుడిని గుర్తించి దేశం నుంచి వెళ్లగొడతాం" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అక్రమ వలసలు, సరిహద్దు భద్రత, పౌరసత్వ అంశాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన వైఖరిని కొనసాగిస్తోందని ఆయన తెలిపారు. అలాగే దేశ భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు మహారాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారగా, ప్రతిపక్ష పార్టీల నుంచి కూడా స్పందనలు వచ్చే అవకాశం ఉంది.

# సిరిసిల్లలో ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్లలో భారీ కుంభకోణం..



**- రూ.91 లక్షల కుంభకోణం గుట్టు రట్టు..**
**-నకిలీ ట్రక్ షీట్ల తో నిధుల దోపిడీ:**
**-ఆరుగురు నిందితుల అరెస్ట్, రూ.14,16,800 స్వాధీనం.. రూ 46,21,358 ఫ్రీజ్"**
**-ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ,?రాజన్న సిరిసిల్ల:**
ప్రభుత్వ ధాన్యం కొనుగోలు ప్రక్రియను అదనుగా తీసుకుని, ట్రక్ షీట్ల ను సృష్టించి ప్రభుత్వ నిధులను దోచుకుంటున్న ముఠా గుట్టును సిరిసిల్ల పోలీసులు రట్టు చేశారు. సుమారు రూ.91 లక్షల ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు . సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ పెద్దూర్ అపారెల్ పార్క్ గోదాం మేనేజర్ ఉత్కం విజయ్ , డీఎంఓ కార్యాలయంలో కో-ఆర్డినేటర్ కమ్మరి రాజశేఖర్ ప్రధాన సూత్రధారులుగా వ్యవహరిస్తూ ఈ అక్రమాలకు తెరలేపారని అన్నారు . వీరు వివిధ ఐకేపీ కేంద్రాల నుంచి ధాన్యం వచ్చినట్లు నకిలీ ట్రక్ షీట్లను సృష్టించి ,రుద్రంగి ఐకేపీ ఇన్‌చార్జ్ గడ్డం స్వామి, బద్దెనపల్లి పీఏసీఎస్ ఇన్‌చార్జ్ గాజుల నవీన్‌ల సహాయంతో ఈ నకిలీ ట్రక్ షీట్లను సివిల్ సప్లై వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి నిధులను తమ ఖాతాల్లోకి మళ్లించుకున్నారని అన్నారు .

?అంతేకాకుండా, అపారెల్ పార్క్ గోదాముకు వచ్చిన 10 లారీల ధాన్యాన్ని లోడ్ దింపకుండానే, రికార్డుల్లో మాత్రం దింపినట్లు నమోదు చేసి,ఇలా దారిమళ్లించిన ధాన్యాన్ని చెపూరి మధుకర్ ద్వారా సిద్ధిపేటకు చెందిన కమిషన్ ఏజెంట్ చిటుకుల శ్రీకాంత్ సాయంతో రైస్ మిల్లులకు విక్రయించి నిధులను పంచుకున్నారని అన్నారు . ఈ అక్రమాలను గుర్తించిన జిల్లా సివిల్ సప్లై మేనేజర్ ఎస్. నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని అన్నారు.

డీఎస్పీ నాగేంద్రచారి నేతృత్వంలోని ప్రత్యేక బృందం నిందితులను పట్టుకుని విచారించగా, సుమారు రూ.91 లక్షల నిధులు అక్రమంగా మళ్లించినట్లు వెల్లడైందని, నిందితుల నుంచి రూ.14,16,800 నగదును స్వాధీనం చేసుకొని, అలాగే నిందితుల బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.46,21,358 మొత్తాన్ని ఫ్రీజ్ చేశామని అన్నారు . ప్రధాన నిందితులు ఉత్కం విజయ్, కమ్మరి రాజశేఖర్, చెపూరి మధుకర్, వాసాల గణేష్, గాజుల నవీన్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని అన్నారు.ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తామని, ఈ కేసులో మరింత లోతైన విచారణ కొనసాగుతోందని,అక్రమాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# అన్నదాత కడుపు కొట్టిన ట్రక్ షీట్ల లూటీ..

**-సిరిసిల్లలో వడ్ల కొనుగోలు మాఫియా..**
**-సిరిసిల్ల వడ్ల స్కాం వెనుక ఉన్న 'బడా' తలకాయలెవరు..?**
**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**
అన్నదాతలకు ఆసరాగా ఉండాల్సిన కొనుగోలు కేంద్రాలే అక్రమార్కులకు అడ్డాగా మారాయి. ప్రభుత్వ ఖజానాను లూటీ చేసేందుకు ఏకంగా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ అధికార యంత్రాంగమే దళారీలతో చేతులు కలిపిన వైనం ఇప్పుడు జిల్లాలో సంచలనం సృష్టిస్తోంది. ఒక చిన్న లారీ దొంగతనం కేసుతో మొదలైన విచారణ, ఇప్పుడు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల వెనుక ఉన్న కోట్లాది రూపాయల నకిలీ ట్రక్ షీట్ల బాగోతాన్ని బయటకు తీసింది.

**ఏఎంసీ అధికారి 'స్కెచ్'.. అడ్డంగా దొరికిన అక్రమార్కులు**
గత నెల 15న సిరిసిల్ల గోడౌన్ నుంచి ధాన్యం మాయమైన ఘటనపై పోలీసులు మొదట సాదాసీదా దొంగతనం అనుకున్నారు. కానీ లోతుగా విచారించే కొద్దీ షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చాయి. లారీ డ్రైవర్, మలక్‌పేట ఐకేపీ సెంటర్ నిర్వాహకుడిని విచారించగా, ఈ వ్యవహారం వెనుక సిరిసిల్ల అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ కి చెందిన ఒక ఉద్యోగి కీలక సూత్రధారిగా వ్యవహరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ గోడౌన్ల నుంచి ధాన్యాన్ని దొంగిలించి, మళ్లీ అదే ధాన్యాన్ని రైతుల పేరుతో ఐకేపీ కేంద్రాల్లో విక్రయించడం ద్వారా ఈ ముఠా ప్రభుత్వ సొమ్మును స్వాహా చేసినట్లు తెలుస్తుంది .

**క్వింటాల్‌కు రూ.1700 దోపిడీ**
ఈ మాఫియా పనితీరు చాలా పక్కాగా ఉంది. అమాయక రైతుల అకౌంట్ వివరాలను సేకరించి, వారికి కొంత కమీషన్ ఎర చూపి, వారి పేర్లతో నకిలీ 'ట్రక్ షీట్లు' సృష్టించారు. ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసే నిధులలో క్వింటాల్‌కు ఏకంగా 1700 రూపాయల చొప్పున ఈ ముఠా వెనకేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రైతులకు విదిల్చిన చిన్న మొత్తాన్ని చూపి, మిగిలిన కోట్లాది రూపాయలను ఏఎంసీ అధికారి, ఐకేపీ సెంటర్ నిర్వాహకులు, లారీ డ్రైవర్లు పంచుకున్నట్లుగా ఆధారాలు సేకరిస్తున్నారు.

**రైస్ మిల్లర్లతో కుమ్మక్కు.. ఖజానాకు భారీ గండి**
ఈ దందా కేవలం గోడౌన్ల కే పరిమితం కాలేదు. స్థానిక రైస్ మిల్లర్లతో కుమ్మక్కై, కాగితాల్లో మాత్రమే కొనుగోళ్లు జరిగినట్లు సృష్టించి ప్రభుత్వ నిధులను ఈ ముఠా మింగేస్తోంది. పండించిన ధాన్యానికి మద్దతు ధర దక్కక రైతులు అల్లాడుతుంటే, దళారీ వ్యవస్థ మాత్రం ప్రభుత్వ ఖజానాకు చిల్లులు పెడుతోంది.

**ముమ్మరంగా దర్యాప్తు.. బయటపడనున్న మరిన్ని తలకాయలు**
ప్రస్తుతం పోలీసులు ఈ కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టారు. గత సీజన్ల రికార్డులను కూడా పరిశీలిస్తూ, ఈ ఫేక్ ట్రక్ షీట్ల దందా ఎంతకాలంగా సాగుతోందో ఆరా తీస్తున్నారు. ఈ అక్రమ సామ్రాజ్యానికి సూత్రధారిగా ఉన్న ఏఎంసీ ఉద్యోగి వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారు? ఇందులో ఉన్నత స్థాయి అధికారుల పాత్ర ఏమైనా ఉందా? అనే కోణంలో పోలీసుల విచారణ ముమ్మరమైంది. త్వరలోనే మరికొందరు అక్రమార్కుల పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం.

# ఉప సర్పంచుల ఆత్మగౌరవ పోరాటం..

**- 'హలో ఉప సర్పంచ్ చలో హైదరాబాద్' కార్యక్రమానికి పిలుపు**
**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
పంచాయతీరాజ్ వ్యవస్థలో భాగంగా ఎన్నికైన ఉప సర్పంచులకు తగిన గుర్తింపు, అధికారాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 25వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'హలో ఉప సర్పంచ్ చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఉప సర్పంచుల సంఘం పిలుపునిచ్చింది. సిరిసిల్ల పట్టణంలో ని

ప్రెస్‌క్లబ్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు జిల్లా అధ్యక్షులు కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఉప సర్పంచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే చెక్ పవర్ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చెక్ పవర్ రద్దు అంశంపై అనేక కథనాలు వస్తున్నా, ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడం వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం తాము ఎన్నికయ్యామని, అప్పుడు లేని నిబంధనలను ఇప్పుడు తీసుకురావడం అన్యాయమని, ఎన్నికలకు ముందే ఈ అంశాన్ని వెల్లడించి ఉంటే తాము పోటీ చేసేవారమే కాదని,ఏదైనా మార్పులు చేయాలంటే అది ఎన్నికలకు ముందే జరగాలని అన్నారు .

శిలా ఫలకాలపై సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ మరియు సంబంధిత వార్డు సభ్యుని పేర్లు తప్పనిసరిగా ఉండాలని, కీలకమైన పంచాయతీ తీర్మానాలలో ఉప సర్పంచ్ సంతకం ఉండాలని అన్నారు . కార్యాలయాల్లో ఉప సర్పంచులకు ప్రత్యేక ఛాంబర్లను కేటాయించాలని, అలాగే ఉప సర్పంచులకు 5,000 రూపాయలు మరియు వార్డు సభ్యులకు 3,000 రూపాయల వేతనాన్ని అందించి, ప్రజాప్రతినిధులుగా తమకు గౌరవం కల్పించాలని డిమాండ్ చేశారు . రాజకీయ పార్టీలకు




అతీతంగా, ఉప సర్పంచులందరూ తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని, ఈ ఆందోళన కార్యక్రమం ఏ పార్టీకి గానీ, ప్రభుత్వానికి గానీ వ్యతిరేకం కాదని, కేవలం తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడమే లక్ష్యమని అన్నారు . ఈ పోరాటంలో పార్టీలకతీతంగా ఉప సర్పంచులందరూ పాల్గొని, హైదరాబాద్ చలో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ పాలనలో రైతుల కన్నీళ్లు..




**- మాజీ జడ్పీ చైర్మన్ అరుణ రాఘవరెడ్డి..**
**బలగం టీవీ, వేములవాడ :**
కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల అత్యంత కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, ఆ పార్టీ పాలన అరాచకమైన రాక్షస పాలన గా మారిందని, కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లు తప్ప మరి ఏమి లేవు అని మాజీ జడ్పీ చైర్మన్ అరుణ రాఘవరెడ్డి అన్నారు.వేములవాడలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహరావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీ చైర్మన్ అరుణ రాఘవరెడ్డి మాట్లాడుతూదేశానికి అన్నం పెట్టే రైతన్నలను రేవంత్ సర్కార్ అనాథలను చేస్తోందని, వారిని ఇబ్బందుల పాలు చేయడం తప్ప, ఒక్క హామీని కూడా నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపించారు.?గత కేసీఆర్ పాలనలో ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసిందని, రైతులకు అండగా నిలిచిన కేసీఆర్ పాలన మళ్ళీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం యూరియా కోసం యాప్‌లని, క్యూలైన్లని పెట్టి రైతుల కష్టాలను పెంచిందని అన్నారు . రైతులకు ఇచ్చిన బోనస్ హామీ, రైతుబంధు పంపిణీ ఏమయ్యాయని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయంగా వాడుకుంటూ, సాగునీటి విషయంలో రైతులను భయపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రైతుల గోసకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సీనియర్ నాయకులు మనోహర్ రెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, ప్యాక్స్ చైర్మన్ లు జలగం కిషన్ రావు, తిప్పని శ్రీనివాస్, సింగిల్ విండో వైస్ చైర్మన్ లు మానుపాటి భూమిరెడ్డి, కాశ వేణి మహేష్, సీనియర్ నాయకులు గడ్డం హన్మండ్లు, అజిత్ రావు, రవి కుమార్, మండల అధ్యక్షులు మల్యాల దేవయ్య, గోసుకుల రవి, పట్టణ మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, గోలి మహేష్, మారం కుమార్, సీనియర్ నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, మండల నాయకులు, అన్ని మండలాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పట్టణ నాయకులు తదితరులు ఉన్నారు.

# వృద్ధులకు భరోసా కల్పించడమే పోలీస్ శాఖ లక్ష్యం..

**-వృద్ధులే మనకు మార్గదర్శకులు.. ఆప్యాయంగా పలకరించిన ఎస్పీ మహేష్ బి.గితే**
**బలగం టీవీ, గంభీరావుపేట:**
సమాజంలో అభాగ్యులకు, నిరాశ్రయులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు . శనివారం గంభీరావుపేట మండల కేంద్రంలోని 'మా' అభాగ్యుల వృద్ధాశ్రమాన్ని ఎస్పీ మహేష్ బి.గితే సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులతో ఎస్పీ ఆప్యాయంగా మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితులను, ఆశ్రమ నిర్వహణకు సంబంధించి అవసరాలను అడిగి తెలుసుకున్నారు.?ఈ పర్యటనలో భాగంగా వృద్ధులకు పండ్లు, బియ్యం, కిరాణా సరుకులు మరియు ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అనంతరం వృద్ధాశ్రమ నిర్వాహకులు మల్లుగారి నర్సాగౌడ్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. నర్సాగౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

?ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ, వృద్ధులకు సేవ చేయడం గొప్ప మానవతా ధర్మమని, అనాథలను, నిరాశ్రయులను ఆదరించడం సామాజిక బాధ్యతని పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి, అవసరమైన వారికి సేవలు అందించడంలో జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ



కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేష్, ఎస్ఐ శ్రీకాంత్, ఆశ్రమ సభ్యులు పాల్గొన్నారు



# శ్రీ కట్ట మైసమ్మ దేవాలయం పక్కన మూత్రశాలల నిర్మాణం వద్దు..

**-మున్సిపల్ కమిషనర్‌కు విశ్వహిందూ పరిషత్ వినతి**
**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**
పాత బస్టాండ్‌లో వెలసిన శ్రీ కట్ట మైసమ్మ దేవాలయం పవిత్రతను కాపాడాలని, ఆలయ గోడకు ఆనుకొని ఉన్న మూత్రశాలలను పునర్నిర్మించకుండా వేరే ప్రాంతానికి తరలించాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంస్థ పట్టణ అధ్యక్షులు గుంటుక పురుషోత్తం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ గతంలో సులబ్ కాంప్లెక్స్ ద్వారా ఆలయ గోడకు ఆనుకొని నిర్మించిన ఈ మూత్రశాలలు మొన్నటి వర్షాలకు/ప్రమాదవశాత్తు కూలిపోయాయని,వీటిని తిరిగి అదే ప్రదేశంలో నిర్మించడం వల్ల హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేవాలయ పవిత్రతకు భంగం కలగకుండా ఉండాలని, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేలా ఈ మూత్రశాలలను శాశ్వతంగా వేరే చోటికి తరలించాలని కోరారు. గతంలో కూడా మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ, ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల మనోభావాలను గౌరవిస్తూ తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్రం విజయరామరాజు, నాగుల శ్రీనివాస్, కోడం రవి, అక్కరం అశోక్, సుంకోజు రమేష్ చారి, గుడ్ల విష్ణు, జిందం రవీందర్ తదితర విహెచ్‌పి ప్రతినిధులు పాల్గొన్నారు.



# యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య వాహనాల మరమ్మతులు..

**-చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి**
**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**
పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య నిర్వహణ వాహనాలు పాడైపోయిన మరియు మరమ్మత్తులు అవసరమైన ట్రాక్టర్లు, ఆటోలను గుర్తించి, వాటి మరమ్మత్తులకు అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణిఆదేశించారు. శనివారం స్థానిక సినారె కళామందిర్ ప్రాంగణంలో మున్సిపల్ పారిశుధ్య నిర్వహణ వాహనాల స్థితిగతులను మున్సిపల్ కమిషనర్ ఎండి ఖాదీర్ పాషాతో కలిసి చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి పరిశీలించారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి మాట్లాడుతూ, పట్టణంలో చెత్త సేకరణకు వినియోగించే ట్రాక్టర్లు, టాటా ఏసీలు వంటి వాహనాలు సక్రమంగా పనిచేయడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణలో ఈ వాహనాలు కీలకమని, కాబట్టి వాటి నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంటుందని తెలిపారు. ?పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించడమే లక్ష్యమని, ఇందుకోసం మరమ్మత్తుల విషయాన్ని పాలకవర్గ దృష్టికి తీసుకువెళ్లి, వాహనాలను యుద్ధ ప్రాతిపదికన బాగు చేయిస్తామని హామీ ఇచ్చారు. మరమ్మత్తులు పూర్తయిన వెంటనే ఆ వాహనాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి, పట్టణంలో చెత్త సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తామని అన్నారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండి ఖాదీర్ పాషా, సానిటరీ ఇన్స్పెక్టర్ రడం శ్రీనివాస్, ఏఈ నరసింహ స్వామి, ఎస్కె ఉమర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# ప్రజా భద్రతే ధ్యేయం.. బాధ్యతగా పనిచేయండి..

**-ఎస్పీ మహేష్ బి. గితే**
**బలగం టీవీ, గంభీరావుపేట:**
ప్రజా భద్రతే ధ్యేయమని,బాధ్యతగా పనిచేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా శనివారం గంభిరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ మహేష్ బి. గితే ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించి, కేసుల పురోగతి, పెండింగ్ దర్యాప్తులు, సిబ్బంది హాజరు, మరియు రౌడీషీటర్లపై నిఘా తీరును క్షుణ్ణంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులను స్వీకరించడంలో ఎటువంటి జాప్యం చేయకుండా, బాధితులకు చట్టపరిధిలో తక్షణ న్యాయం అందేలా చూడాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా ప్రజలను భాగస్వామ్యం చేసి గ్రామాలు, పట్టణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని సూచించారు.విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో మమేకం కావాలని, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, గంజాయి మరియు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి, చోరీలు మరియు అసాంఘిక కార్యకలాపాలపై డేగ కన్నుతో నిఘా ఉంచాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేయడంతో పాటు, పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ వెంకటేష్, ఎస్.ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గల్ఫ్ బాధితుల సంక్షేమ సంఘం రాష్ట్ర సలహాదారుగా మహమ్మద్ లాలా నియామకం

**-ఎల్లారెడ్డిపేటలో పర్యటించిన సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూత్కూరి కాంత**
**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట:**
తెలంగాణ గల్ఫ్ బాధితుల సంక్షేమ సంఘం రాష్ట్ర సలహాదారులుగా రాజన్న సిరిసిల్ల జిల్లా, ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ లాలాను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూత్కూరి కాంత ఉత్తర్వులను జారీ చేశారు. అలాగే, జిల్లా సెక్రెటరీగా సుధమల శ్రీనివాస్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు మహమ్మద్




లాలా మరియు సుధమల శ్రీనివాస్‌లకు నియామక పత్రాలను అందజేసి, వారికి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

?ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ పంచాయతీని సందర్శించిన రాష్ట్ర అధ్యక్షులు భూత్కూరి కాంత, సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ మరియు పాలకవర్గ సభ్యులతో భేటీ అయ్యారు. గల్ఫ్ బాధితుల సమస్యల పరిష్కారంలో తమ సంఘం అలుపెరగక కృషి చేస్తోందని అన్నారు. పార్టీలకు అతీతంగా బాధితులకు అండగా ఉంటామని, గల్ఫ్ దేశాల్లో అనివార్య కారణాల వల్ల ఎవరైనా మరణిస్తే, వారి మృతదేహాలను స్వదేశానికి రప్పించి కుటుంబ సభ్యులకు అందజేసేలా పూర్తి బాధ్యత తీసుకుంటామని తెలిపారు. అంతేకాకుండా, గల్ఫ్ బాధితుల భూములు ఎవరైనా ఆక్రమిస్తే ఆ సమస్యలను కూడా చట్టబద్ధంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

?తమ సంఘం తరపున ఎవరైనా బాధితులు సమస్యలను , తక్షణమే రాష్ట్ర సలహాదారులుగా నియమితులైన మహమ్మద్ లాలా లేదా జిల్లా సెక్రెటరీ సుధమల శ్రీనివాస్ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం, గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ మరియు గ్రామ పాలకవర్గం సభ్యులు రాష్ట్ర అధ్యక్షులు భూత్కూరి కాంతను శాలువాతో ఘనంగా సన్మానించి, వారి సేవా దృక్పథాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 3,909 కేసుల పరిష్కారం..
## రూ.2.27 కోట్ల పరిహారం, జరిమానాల వసూళ్లు

**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**

శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో మొత్తం 3,909 కేసులను పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి పి. నీరజ తెలిపారు. ఈ సందర్భంగా నష్టపరిహారం, జరిమానాలు మరియు రాజీ పరిష్కారాల రూపంలో మొత్తం రూ.2,27,71,225 చెల్లింపులు జరిగినట్లు వెల్లడించారు.

లోక్ అదాలత్‌లో మోటార్ వాహన ప్రమాదాలకు సంబంధించిన 15 కేసులు, సివిల్ తగాదాల 10 కేసులు, 246 క్రిమినల్ కేసులు, 61 సైబర్ క్రైమ్ కేసులు, 9 ఎక్సైజ్ కేసులు, 4 చెక్ బౌన్స్ కేసులు, 8 కుటుంబ తగాదాల కేసులు, 86 బ్యాంకు కేసులు, 23 బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన కేసులు, 1,028 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, 2,419 ట్రాఫిక్ చలాన్ కేసులు పరిష్కరించబడ్డాయి. ఈ సందర్భంగా ప్రజలు కోర్టు వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ వేదికగా నిలుస్తోందని న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి శ్రీమతి బి. పుష్పలత, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, అదనపు ఎస్పీ డి. చంద్రయ్య, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల–కమ్–ఎఫ్ఏసీ కార్యదర్శి డీఎల్ఎస్ఏ పి. లక్ష్మణాచారి, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవునూరి రమాకాంతరావు, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.



## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు..
**-పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ :**


వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ వేడుకలను పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని కేక్ కట్ చేసి కార్యకర్తలకు, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మహాలక్ష్మి వీధిలో ముదిరాజ్ సంఘం వారు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ బోనాల మహోత్సవంలో పాల్గొన్నారు..

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకుడు రాహుల్ గాంధీ అని అన్నారు . ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషి దేశానికి ఆదర్శమని పేర్కొన్నారు. దేశంలో అసమానతలు రూపుమాపి సామాజిక న్యాయం సాధించాలనే సంకల్పంతో రాహుల్ గాంధీ ముందుకు సాగుతున్నారని తెలిపారు.కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, మణిపూర్ నుంచి ముంబై వరకు నిర్వహించిన పాదయాత్రల ద్వారా ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న నాయకుడు రాహుల్ గాంధీ అని అన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు .ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ రాజీలేని పోరాటం చేస్తున్నారని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఆయనను స్ఫూర్తిగా తీసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే కాంగ్రెస్ కార్యకర్తల లక్ష్యమని అన్నారు. అనంతరం రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆశీస్సులు ఆయనపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.




## పానీ పూరి విక్రయ దుకాణాల్లో తనిఖీలు
**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల,**

ప్రభుత్వ ఆదేశాల మేరకు, సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వైద్య శాఖ అధికారులు, ఆహార భద్రతా అధికారి సంయుక్తంగా శుక్రవారం పానీపూరి విక్రయ దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల సమయంలో, అపరిశుభ్రమైన పరిస్థితుల్లో తయారు చేసిన పూరీలు, పప్పు, నీరు అధికారులు గుర్తించారు. అపరిశుభ్రంగా ఉన్న వాటిని వెంటనే సిబ్బందితో తొలగింపజేశారు. ఆహార పదార్థాల తయారీ లో పాటించాల్సిన జాగ్రత్తలు, నియమాలను నియమాలపై అవగాహన కల్పించారు. పని సమయంలో తప్పనిసరిగా ఆప్రాన్లు, హెయిర్ క్యాప్స్ ధరించాలని వారికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే, పానీ నమూనాలను కూడా సేకరించారు. తనిఖీలో వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖితారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు ఖాదర్ పాషా, లోకేష్, డిప్యూటీ డీ ఎంహెచ్ఓ ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష తదితరులు ఉన్నారు.



## శ్రీ పెద్దిరాజు--పెద్దమ్మ కళ్యాణ మహోత్సవంలో రెడ్డబోయిన గోపీ
**బలగం టీవి, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ మరియు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పెద్దిరాజు--పెద్దమ్మ కళ్యాణ మహోత్సవంలో భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి, శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ పొన్నాల మహేష్, అంకిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ మరియు బీజేవైఎం జిల్లా అధ్యక్షులు రాగుల రాజిరెడ్డి, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రం రెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బోనాల సాయి కుమార్, బీజేపీ సిరిసిల్ల పట్టణ ప్రధాన కార్యదర్శి కొండ నరేష్, ఎల్లారెడ్డిపేట మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు దాసరి పూర్ణిమ పాల్గొన్నారు. అదేవిధంగా ముదిరాజ్ సంఘం సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పెద్దూరు పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం
**బలగం టీవీ, పెద్దూరు**



ఎం పి హెచ్ ఎస్ పెద్దూరు పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మోతిలాల్ ,8 వ వార్డ్ కౌన్సిలర్ లింగంపల్లి భాగ్యలక్ష్మి, గ్రామ పెద్దలు లింగంపల్లి సత్యనారాయణ, దొంతినేని అశోక్ రావు, బాలరాజు విచ్చేసి చిన్నారుల తో ఓనమాలను దిద్దించి అక్షరాభ్యాసాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ అక్షరం విలువైన ధనం అని, అక్షర జ్ఞానాన్ని మించిన సంపద లేదని, చిన్నారులశీదరూ బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. అతిథులు, తల్లిదండ్రులందరూ అక్షింతలతో విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి, ఉపాధ్యాయ బృందం గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమా, భైరి వాణిశ్రీ, కడార్ల కల్పన, నాగుల వీణ, నందాల శంకర్, జంగపల్లి రాజమల్లు, ఈరబోయిన రవికుమార్, గడ్డి మహేశ్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# చేనేతన్నల సంక్షేమమే లక్ష్యం.

**.ప్రజా ప్రభుత్వంలోనే నేతన్నలకు భరోసా**
**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ,వేములవాడ:**



చేనేత కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, నేతన్నలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు . వేములవాడ పట్టణంలో ఇటీవల జరిగిన చేనేత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గం సభ్యులు ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు తాటికొండ రాజయ్య, కార్యదర్శి పారవెల్లి రాజేశం, కోశాధికారి రాపెల్లి దేవదాసులతో పాటు ఇతర సభ్యులకు పార్టీ కండువాలను విప్ ఆది శ్రీనివాస్ కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై చేనేత సంఘం సభ్యులు స్వచ్ఛందంగా పార్టీలో చేరడం హర్షణీయమని అన్నారు. చేనేత రంగాన్ని ఆదుకోవడంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, గత పాలనలో పేరుకుపోయిన బకాయిలను విడుదల చేసి నేతన్నల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు .

వేములవాడలో రూ. 50 కోట్ల వ్యయంతో యారన్ డిపోను ఏర్పాటు చేయడం చేనేత రంగానికి కొత్త ఊపిరి పోసిందని, నేతన్నలకు నిరంతర ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం కొత్త ఆర్డర్లను కూడా మంజూరు చేస్తోందని అన్నారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన చేనేత సంఘం కార్యవర్గం నాయకత్వంలో ఈ ప్రాంతంలో చేనేత రంగం మరింత పురోగతి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం నేతన్నల కుటుంబాల ఆర్థికాభివృద్ధికి కట్టుబడి ఉందని, వారికి అన్ని విధాలా అండగా నిలుస్తుందని అన్నారు .

?ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న విశ్వాసానికి ఈ చేరికలే నిదర్శనమని, గ్రామీణ స్థాయి నుంచి అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ విధానాలను ఆదరిస్తున్నారని అన్నారు. ఈ చేరికలతో వేములవాడలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కానుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, పట్టణ అధ్యక్షులు తుమ్మ మధు, కౌన్సిలర్లు కొక్కుల బాలకృష్ణ, ఇప్పపూల అజయ్, చేనేత సంఘం కార్యవర్గ సభ్యులు దూసా రాజేశం, పులి సత్యనారాయణ, తాటికొండ రామస్వామి తదితరులు పాల్గొన్నారు

# నాలుగేళ్లు నిండిన చిన్నారులను బడికి పంపండి:



**జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి**

**బలగం టీవీ, బోయినపల్లి :**

ప్రభుత్వం చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ పాఠశాలలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని బోయినపల్లి, కొదురుపాక, గుండన్నపల్లి, కోరేం గ్రామాలలో నూతనంగా మంజూరైన ప్రీ ప్రైమరీ పాఠశాలలను జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పునాది దశలోనే నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు . గతేడాది జిల్లాలో 14 ప్రీ ప్రైమరీ పాఠశాలలను మంజూరు చేయగా, ఈ ఏడాది అదనంగా 48 పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు . నాలుగు సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థిని ప్రీ ప్రైమరీ స్కూళ్లకు పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం ప్రతి పాఠశాల అభివృద్ధికి రూ. 1.5 లక్షల చొప్పున నిధులను వెచ్చిస్తుందని తెలిపారు. ఈ నిధులతో తరగతి గదులను ఆకర్షణీయమైన రంగులతో తీర్చిదిద్దడమే కాకుండా, చిన్నారులకు కావాల్సిన ఫర్నిచర్ మరియు ఆట బొమ్మలను అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో ఒక టీచర్‌తో పాటు ఒక ఆయాను కూడా ప్రభుత్వం నియమిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నల్లమోహన్, కొప్పుల లావణ్య, జంపక మాధవి, కత్తెరపాక మంజుల, వార్డు సభ్యులు చౌదరి శ్రీధర్, అమ్మిగల్ల గోపాల్, నాయకులు మెరుపుల జలంధర్, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షులు పిట్టల జలజ, ప్రీ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కనకయ్య, సత్యనారాయణ, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు భూమయ్య, బొలగం శ్రీనివాస్ మరియు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేటలో పానీపూరి బంద్

**కల్తీపై నోటీసులు జారీ చేసిన అధికారులు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండలంలో పానీపూరి బండ్లకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. కల్తీ పానీపూరి తిని కెసిఆర్ కాలనీలో చాలామంది అస్వస్థతకు గురి కావడంతో జిల్లా ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలో పానీ పూరి దుకాణాలకు నోటీసులను శుక్రవారం అందించారు. ఒక వారం రోజులపాటు పానీ పూరి బండ్లు తీసివేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు సూచించిన నిబంధనల ప్రకారమే పానీ పూరి విక్రయాలు జరగాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ పానీ పూరి వల్ల చాలామంది అనారోగ్యాలు బారిన పడుతున్నారని అన్నారు. నోటీసు అందించిన వారిలో పంచాయతీ కార్యదర్శి తో పాటు ఎల్లారెడ్డిపేట ఉప సర్పంచ్ బందారపు బాల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# గర్భిణులు, బాలింతలు పోషక ఆహారం తీసుకోవాలి



**ఐసిడిఎస్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ వనిత**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట మండలంలోని అగ్రహారం గ్రామంలో శుక్రవారం అక్షరాస్యత కార్యక్రమాన్ని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసిడిఎస్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ వనిత. గ్రామ సర్పంచ్ మామిండ్ల కిషన్. ప్రధానోపాధ్యాయుడు పూర్ణచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు మరియు బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పోషకాహారం గురించి వారికి వివరించారు. అలాగే బడిబాట కార్యక్రమంలో భాగంగా ఫ్రీ స్కూల్ విద్యార్థులను అంగన్వాడికి పంపించాలని గ్రామస్తులను కోరారు. గ్రామంలో 95 శాతం విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో అంగన్వాడీలో చదివిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ఉన్న పలువురు చిన్నారులను గ్రామ పాలకవర్గ సభ్యులు అక్షరాభ్యాసం చేయించారు. గ్రామంలో ఉన్న గర్భిణీ స్త్రీలతో పాటు బాలింతలు పోషకాహారం తీసుకుంటే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులతోపాటు అంగన్వాడీ టీచర్ పద్మ, పలువురు గర్భిణీలు, బాలింతలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు,

# ‘ప్రైవేటు’లో ఫ్రీ స్కూల్ కిట్

**నో అడ్మిషన్ ఫీజు**

**కొత్తగా పినాకిల్ అప్పర్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

బడి మొదలయ్యిందంటే ప్రైవేటు స్కూల్ దందాతో సతమతమవుతున్న మధ్యతరగతి తల్లిదండ్రులకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన పినాకిల్ ఇంగ్లీష్ మీడియం నో అడ్మిషన్ ఫీ, ఫ్రీస్కూల్ కిట్ ప్రకటనతో ఊరటనిచ్చింది. వివరాల్లోకి వెలితే మండలంలో గత కొంత కాలంగా కార్పోరేట్ స్కూల్స్?తో పాటు స్థానిక పాఠశాలల నిర్వాహకులు సైతం అమాంతం ఫీజులు పెంచడంతో తల్లిదండ్రులు బెంబేలెత్తుతున్నారు. అసలే అన్ని రంగాలు కుదేలై వ్యాపారాలు నడవక, వ్యవసాయం భరోసానివ్వక, గల్ఫ్ దేశాల్లో పరిస్థితులు బాగలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తరుణంలో మళ్లీ బడి మొదలయ్యిందనడంతో తల్లిదండ్రులు గాబరా పడతున్నారు. ఇదే సమయంలో స్కూల్ యూనిఫాం, బ్యాగులు, పుస్తకాలు, అడ్మిషన్ ఫీజులు, అంటూ కనీసం ఒక్కో విద్యార్థికి రూ.50వేల ఖర్చును ఊహించుని భయభ్రాంతులకు గురవుతున్నారు. దీంతో కొంతమంది మండల వాసులు పాఠశాల నిర్వహణలో దశాబ్దాల అనుభవజ్ఞుడైన మండల కేంద్రానికి చెందిన మహ్మద్ కయీస్ ను పాఠశాల ఏర్పాటు చేయాలని చెప్పడంతో గత ఏడాది నుంచి పాఠశాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యాడు. అనూహ్యంగా పినాకిల్ ఇంగ్లీష్‌మీడియం అప్పర్‌ప్రైమరీ పాఠశాలను శుక్రవారం ప్రారంభించి నాణ్యమైన ఇంగ్లీష్ విద్యను గ్రామీణ మధ్యతరగతి వర్గాలకు చెల్లింపు సామర్థ్యం బేస్ చేసుకుని తీసుకుంటామని ప్రకటించారు. అలాగే నర్సరీ నుంచి ఏడో తరగతి విద్యార్థులకు ఉచితంగా స్కూల్ కిట్ పేరిట యూనిఫాం, బ్యాగులు ఇతర సామాగ్రి అందిస్తామని, అలాగే అడ్మిషన్ ఫీజు తీసుకోవడం లేదని సంచలన నిర్ణయాన్ని ప్రకటించారు. మొదటి ఏడాది పాఠశాల ప్రారంభించిన సందర్భంగా ప్రకటిస్తున్నామని అన్నారు. అనుభవజ్ఞులైన టీచర్లతో నాణ్యమైన విద్యను అందించేందుకు తల్లిదండ్రుల సూచనలతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాను పుట్టి పెరిగిన



మండల ప్రజలకు నాణ్యమైన విద్యను వారికి అందుబాటులో ఉండే ఫీజులు(తల్లిదండ్రులు నిర్ణయించిన) తీసుకుని నిర్వహిస్తామని భరోసానిచ్చారు. నూతన ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రారంభోత్సవానికి మార్కెట్ కమిటీ చైర్మన్ సబేరా బేగం గౌస్ బాయ్, వైస్ చైర్మన్ రామ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు గుర్రాల రాజిరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, బాల్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఒగ్గు రజిత యాదవ్, ఒగ్గు బాల్ రాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు,

# యశస్వి సెంచరీతో భారత్ ఘన విజయం




## అఫ్గానిస్థాన్‌పై 9 వికెట్ల తేడాతో జయం.. సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత్

**బలగం టీవి, హైదరాబాద్**

అఫ్గానిస్థాన్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. చెన్నైలోని చెపాక్ మైదానంలో శనివారం జరిగిన మూడో వన్డేలో 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌ను 3–0తో కైవసం చేసుకుంది. యశస్వి జైస్వాల్ అజేయ శతకం, రోహిత్ శర్మ అర్ధశతకం, ప్రసిద్ధ్ కృష్ణ ఐదు వికెట్ల ప్రదర్శనతో భారత్ అన్ని విభాగాల్లోనూ ఆధిపత్యం చెలాయించింది.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్థాన్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. భారత పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థి అగ్రశ్రేణి బ్యాటర్లను పెవిలియన్‌కు పంపాడు. రహ్మానుల్లా గుర్బాజ్, రహ్మత్ షా, ఇబ్రహీం జద్రాన్, దర్వీష్ రసూలీ వికెట్లను కూల్చడంతో అఫ్గానిస్థాన్ 36 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

ఈ దశలో కెప్టెన్ హష్మతుల్లా షాహిది, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ఐదో వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టును నిలబెట్టారు. ఒమర్‌జాయ్ 50 పరుగులు చేయగా, షాహిది 131 బంతుల్లో 102 పరుగులు చేసి తన తొలి వన్డే శతకాన్ని నమోదు చేశాడు. మహ్మద్ నబీ 21 పరుగులు చేయగా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. దీంతో అఫ్గానిస్థాన్ 44.2 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌటైంది. భారత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 23 పరుగులకే ఐదు వికెట్లు తీసి మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. ప్రిన్స్ యాదవ్, హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్ తలో వికెట్ సాధించారు.

219 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 170 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి అఫ్గాన్ బౌలర్లపై పూర్తిగా ఆధిపత్యం చెలాయించారు. రోహిత్ శర్మ 69 బంతుల్లో 79 పరుగులు చేసి అవుట్ కాగా, అతని ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 3 సిక్సర్లు ఉన్నాయి.మరోవైపు యశస్వి జైస్వాల్ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. కేవలం 83 బంతుల్లో శతకం పూర్తి చేసిన అతడు 86 బంతుల్లో 110 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, 3 సిక్సర్లు ఉన్నాయి. శ్రేయస్ అయ్యర్ 20 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. భారత్ కేవలం 28.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఇంకా 21 ఓవర్లకు పైగా మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించి సిరీస్ మొత్తంలో తమ ఆధిపత్యాన్ని చాటుకుంది.



# నేటి నుంచి టీజీ-20 లీగ్ సందడి




## తొలి మ్యాచ్‌లో పాలమూరు, ఖమ్మం జట్ల మధ్య పోరు

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ క్రికెట్ సంఘం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టీజీ--20 లీగ్‌కు సర్వం సిద్ధమైంది. ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ మైదానం వేదికగా ఆదివారం నుంచి ప్రారంభమవుతున్న ఈ లీగ్ తొలి సీజన్‌పై క్రీడాభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. లీగ్‌లో ఎనిమిది ఫ్రాంచైజీ జట్లు పాల్గొంటుండగా, భారత జట్టు ఆటగాళ్లు తిలక్ వర్మ, మహ్మద్ సిరాజ్‌తో పాటు సుమారు 160 మంది క్రికెటర్లు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. రాష్ట్ర క్రికెట్‌కు కొత్త ఊపు తీసుకురావాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ టోర్నీకి విశేష ఆదరణ లభిస్తోంది.తొలి రోజు జరిగే మ్యాచ్‌లో సీవీ మిలింద్ నాయకత్వంలోని ఖమ్మం జట్టు, ప్రజ్ఞయ్ రెడ్డి సారథ్యంలోని పాలమూరు జట్టుతో తలపడనుంది. ఈ మ్యాచ్‌పై ఇరు జట్ల అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.మ్యాచ్ ప్రారంభానికి ముందు ఉప్పల్ మైదానంలో ఘనంగా ప్రారంభోత్సవ వేడుకలను నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభోత్సవాన్ని ఆకట్టుకునేలా రూపొందించారు. టీజీ--20 లీగ్ ద్వారా రాష్ట్రంలోని యువ క్రికెటర్లకు తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభించనుండగా, భవిష్యత్‌లో రాష్ట్ర క్రికెట్ అభివృద్ధికి ఈ లీగ్ కీలకంగా మారుతుందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# నేషన్స్ కప్ ఫైనల్లోకి భారత్

## చిలీపై 6-0 గోల్స్ తేడాతో ఘన విజయం

**బలగం టీవి, హైదరాబాద్**

ఎఫ్ఐహెచ్ మహిళల నేషన్స్ కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత మహిళల జట్టు అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీఫైనల్ పోరులో చిలీ జట్టును 6–0 గోల్స్ తేడాతో చిత్తుగా ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది.

మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన భారత జట్టు ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. నవనీత్ కౌర్ ఆరో, 13వ నిమిషాల్లో వరుసగా రెండు గోల్స్ చేసి జట్టుకు శుభారంభం అందించింది. అనంతరం దీపిక 14వ, 18వ నిమిషాల్లో రెండు గోల్స్ నమోదు చేసి భారత ఆధిక్యాన్ని మరింత పెంచింది. మూడో క్వార్టర్‌లో నేహా 32వ నిమిషంలో మరో గోల్ సాధించగా, రుతుజా దాదాసో 39వ నిమిషంలో గోల్ చేసి భారత విజయాన్ని ఖరారు చేసింది. అన్ని విభాగాల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్టు చిలీపై ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో భారత్ వరుసగా రెండోసారి నేషన్స్ కప్ ఫైనల్‌కు చేరుకుంది. ఆదివారం జరిగే తుది పోరులో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టుతో భారత్ టైటిల్ కోసం తలపడనుంది.

# గాయంతో ప్రపంచకప్‌కు దూరమైన శ్రేయాంక పాటిల్


ప్రేమా రావత్‌కు భారత జట్టులో అవకాశం

**బలగం టీవి, హైదరాబాద్**

భారత మహిళల జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. గాయం కారణంగా స్టార్ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీ నుంచి వైదొలిగింది. ఆమె స్థానంలో లెగ్ స్పిన్నర్ ప్రేమా రావత్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి ఎంపిక చేసింది.

బుధవారం నెదర్లాండ్స్‌తో జరిగిన ప్రపంచకప్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా శ్రేయాంక కుడి మడమకు గాయమైంది. గాయం కారణంగా ఆమె మైదానంలోనే తీవ్ర నొప్పితో బాధపడగా, వైద్య సిబ్బంది స్ట్రెచర్‌పై మైదానం వెలుపలికి తరలించారు. అనంతర వైద్య పరీక్షల్లో గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. దీంతో ప్రపంచకప్ సాంకేతిక కమిటీ శ్రేయాంక స్థానంలో కొత్త ఆటగాడిని ఎంపిక చేసేందుకు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో ఉన్న ప్రేమా రావత్‌ను మిగిలిన టోర్నీకి భారత జట్టులోకి తీసుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఆసియా రైజింగ్ స్టార్స్ పోటీల్లో ప్రేమా రావత్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఐదు మ్యాచ్‌ల్లో ఎనిమిది వికెట్లు తీసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది. గత ఏడాది ఆస్ట్రేలియా పర్యటనలో భారత 'ఎ' జట్టు తరఫున మూడు టీ20 మ్యాచ్‌ల్లో ఏడు వికెట్లు తీసి అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచింది. గాయపడిన శ్రేయాంక పాటిల్ బెంగళూరులోని జాతీయ క్రికెట్ శిక్షణ కేంద్రంలో పునరావాస చికిత్స పొందనుంది.

**భారత 'ఎ' జట్టులో మార్పులు**

ప్రేమా రావత్ సీనియర్ జట్టులోకి ఎంపిక కావడంతో భారత 'ఎ' జట్టులో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనున్న భారత 'ఎ' జట్టులో ప్రేమ స్థానంలో టీ20 జట్టుకు నిక్కీ ప్రసాద్, వన్డే జట్టుకు మిన్ను మణి ఎంపికయ్యారు.

ఇంగ్లాండ్ పర్యటనలో భారత 'ఎ' జట్టు మూడు టీ20లు, మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌లు ఆడనుంది. ఈ పర్యటన జూలై 4 వరకు కొనసాగనుంది.



# నాకౌట్‌కు దూసుకెళ్లిన అమెరికా

## ఆస్ట్రేలియాపై 2-0 గోల్స్ తేడాతో విజయం

**బలగం టీవి, హైదరాబాద్**

ఆతిథ్య అమెరికా జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసి ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో నాకౌట్ దశకు అర్హత సాధించింది. శనివారం జరిగిన గ్రూప్–డి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 2–0 గోల్స్ తేడాతో విజయం సాధించి తదుపరి దశలోకి దూసుకెళ్లింది.

ఒకే ప్రపంచకప్ టోర్నీలో అమెరికా వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించడం 1930 తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ విజయంతో ఆతిథ్య జట్టు అభిమానుల్లో ఆనందం నెలకొంది. మ్యాచ్ 11వ నిమిషంలో ఆస్ట్రేలియా డిఫెండర్ కేమరాన్ బర్గెస్ చేసిన పొరపాటు జట్టుకు చేటు చేసింది. బంతిని తన జట్టు గోల్‌పోస్ట్‌లోకే పంపడంతో అది స్వీయ గోల్‌గా నమోదై అమెరికా ఆధిక్యంలోకి వెళ్లింది. మొదటి అర్ధభాగం ముగియడానికి రెండు నిమిషాల ముందు సెర్జినో డెస్ట్ కొట్టిన షాట్ దిశ మారగా, 21 ఏళ్ల అలెక్స్ ఫ్రీమాన్ చాకచక్యంగా హెడర్ ద్వారా గోల్‌గా మలిచాడు. దీంతో అమెరికా 2–0 ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో అర్ధభాగంలో ఆస్ట్రేలియా సమీకరణ కోసం ప్రయత్నించినప్పటికీ అమెరికా రక్షణ శ్రేణిని ఛేదించలేకపోయింది. ఫలితంగా అమెరికా మరో విజయాన్ని ఖాతాలో వేసుకుని నాకౌట్ దశకు చేరుకుంది.

# హైతీపై బ్రెజిల్ ఘన విజయం



## కున్హా డబుల్ గోల్స్‌తో 3-0 తేడాతో జయం

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన బ్రెజిల్ జట్టు రెండో మ్యాచ్‌లో సత్తా చాటింది. గ్రూప్–సి పోరులో హైతీపై 3–0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించి నాకౌట్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది.

మొరాకోతో జరిగిన తొలి మ్యాచ్‌ను డ్రాగా ముగించిన బ్రెజిల్ ఈ మ్యాచ్‌లో ప్రారంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. స్టార్ ఫార్వర్డ్ మాథ్యూస్ కున్హా 23వ, 36వ నిమిషాల్లో రెండు గోల్స్ సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. వినీసియస్ జూనియర్ తొలి అర్ధభాగం అదనపు సమయంలో మరో గోల్ చేసి జట్టు ఆధిక్యాన్ని మరింత పెంచాడు.

ఆట 23వ నిమిషంలో వినీసియస్ కొట్టిన షాట్‌ను హైతీ గోల్‌కీపర్ అడ్డుకున్నప్పటికీ, రీబౌండ్ అయిన బంతిని కున్హా గోల్‌గా మలిచాడు. అనంతరం వినీసియస్ అందించిన పాస్‌ను అందిపుచ్చుకున్న కున్హా మరోసారి గోల్ చేయడంతో బ్రెజిల్ 2–0 ఆధిక్యంలోకి వెళ్లింది.

తొలి అర్ధభాగం ముగిసేలోపే వినీసియస్ జూనియర్ గోల్ సాధించడంతో బ్రెజిల్ 3–0తో తిరుగులేని స్థితికి చేరుకుంది. రెండో అర్ధభాగంలో హైతీ తిరిగి పోటీలోకి రావడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

ఈ ఓటమితో హైతీ టోర్నీ నుంచి నిష్క్రమించిన తొలి జట్టుగా నిలిచింది. 1974 తర్వాత ప్రపంచకప్‌కు అర్హత సాధించిన హైతీ వరుస పరాజయాలతో నిరాశపరిచింది. బ్రెజిల్ తన తదుపరి మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో తలపడనుంది.

**మొరాకోకు విజయం**

గ్రూప్–సిలో జరిగిన మరో మ్యాచ్‌లో మొరాకో 1–0 తేడాతో స్కాట్లాండ్‌పై విజయం సాధించింది. మ్యాచ్ ప్రారంభమైన 72వ సెకనులోనే సైబారీ చేసిన గోల్ జట్టుకు విజయాన్ని అందించింది.

**నిబంధన ఉల్లంఘనకు రెడ్ కార్డు**

గ్రూప్–డిలో జరిగిన మరో మ్యాచ్‌లో పరాగ్వే 1–0తో తుర్కియేపై విజయం సాధించింది. మ్యాచ్ ప్రారంభమైన 65వ సెకనులోనే మథియాస్ గలార్జా గోల్ చేసి ప్రపంచకప్‌లో అత్యంత వేగవంతమైన గోల్ నమోదు చేశాడు.

ఇదిలా ఉండగా, తుర్కియే ఆటగాడితో జరిగిన వాగ్వాదం సందర్భంగా నోటిని చేత్తో కప్పుకున్నందుకు పరాగ్వే ఆటగాడు మిగ్యుల్ అల్మిరాన్‌కు రెఫరీ ఎర్ర కార్డు చూపించాడు. ఫిఫా అమలు చేసిన కొత్త నిబంధన ప్రకారం ఈ చర్య నిషేధించబడటంతో, ఈ కారణంగా ఎర్ర కార్డు పొందిన తొలి ఆటగాడిగా అల్మిరాన్ నిలిచాడు.



# రాష్ట్ర షూటింగ్ పోటీలు ప్రారంభం

## గచ్చిబౌలిలో రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌కు శ్రీకారం

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర షుటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు గచ్చిబౌలిలోని షుటింగ్ రేంజ్‌లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతీయ రైఫిల్ సంఘం ఉపాధ్యక్షుడు, తెలంగాణ రైఫిల్ సంఘం అధ్యక్షుడు అమిత్ సంఘి తొలి షాట్ కాల్చి పోటీలను ప్రారంభించారు. ఈ నెల 27 వరకు జరిగే ఈ పోటీల్లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్, పిస్టల్, ట్రాప్, స్కీట్ విభాగాల్లో ఒలింపిక్, నాన్–ఒలింపిక్ ఈవెంట్లు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 1,500 మందికి పైగా షుటర్లు ఈ పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు.

ఈ చాంపియన్‌షిప్‌లో కనీస అర్హత మార్కులు సాధించిన క్రీడాకారులు దక్షిణ మండల షుటింగ్ చాంపియన్‌షిప్‌తో పాటు జాతీయ స్థాయి షుటింగ్ పోటీలకు తెలంగాణ జట్టుకు ఎంపిక కానున్నారు. రాష్ట్రంలో షుటింగ్ క్రీడాభివృద్ధికి ఈ పోటీలు దోహదపడనున్నాయని నిర్వాహకులు తెలిపారు. యువ షుటర్లకు తమ ప్రతిభను నిరూపించుకునే వేదికగా ఈ చాంపియన్‌షిప్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.



# క్లీంకార ఫొటోను పంచుకున్న రామ్ చరణ్ దంపతులు

**మూడో పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ప్రత్యేక కానుక**

**బలగం టీవీ, హైదరాబాద్**

నటుడు రామ్ చరణ్, ఉపాసన దంపతులు తమ కుమార్తె క్లీంకార ఫొటోను తొలిసారిగా అభిమానులతో పంచుకున్నారు. క్లీంకార మూడో పుట్టినరోజు సందర్భంగా సామాజిక మాధ్యమాల వేదికగా ఆమె చిత్రాన్ని విడుదల చేయడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జూలై 20న క్లీంకార మూడో పుట్టినరోజు జరుపుకోనుండగా, ఆ సందర్భంగా ఉపాసన చేసిన సామాజిక మాధ్యమాల పోస్టు విస్తృతంగా ఆదరణ పొందింది. ఇప్పటి వరకు తమ కుమార్తె ముఖాన్ని ప్రజలకు చూపించకుండా జాగ్రత్త పడిన ఈ దంపతులు, ప్రత్యేక సందర్భంగా ఆమె చిత్రాన్ని పంచుకోవడం విశేషంగా మారింది.

చిరునవ్వులు చిందిస్తున్న క్లీంకార ఫొటోను చూసిన అభిమానులు ఆమె తల్లి ఉపాసనను పోలి ఉందంటూ వ్యాఖ్యానిస్తున్నారు. పోస్టు వెలువడిన కొద్ది సేపటికే లక్షలాది మంది అభిమానులు స్పందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల రామ్ చరణ్, ఉపాసన దంపతులకు కవల సంతానం కలిగిన సంగతి తెలిసిందే. కుమారుడికి శివరామ్ కొణిదెల, కుమార్తెకు అన్వీరా దేవి కొణిదెల అనే పేర్లు పెట్టినట్లు కుటుంబ వర్గాలు వెల్లడించాయి. మెగాస్టార్ చిరంజీవి వారసుడిగా సినీ రంగంలోకి అడుగుపెట్టిన రామ్ చరణ్ ఇటీవల 'పెద్ది' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న కొత్త చిత్రాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.



# చిన్నారి నిరంజన్‌కు రూ.5 లక్షల ఆర్థిక సాయం

**కుటుంబాన్ని పరామర్శించిన బండ్ల గణేశ్**

**బలగం టీవి, హైదరాబాద్**

సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న హనుమకొండకు చెందిన చిన్నారి నిరంజన్ కుటుంబానికి ప్రకటించిన రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని ఆదివారం స్వయంగా అందజేశారు.

హనుమాన్‌నగర్‌లోని నిరంజన్ నివాసానికి వెళ్లిన బండ్ల గణేశ్ చిన్నారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం తల్లిదండ్రులు రాంగోపాల్ చారి, మానసలతో మాట్లాడి నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తన నిర్మాణ సంస్థ తరపున రూ.5 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేసిన బండ్ల గణేశ్, భవిష్యత్తులో కూడా తమ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారి నిరంజన్ పరిస్థితి గురించి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించిన తర్వాతే తనకు తెలిసిందన్నారు. ఆయన స్ఫూర్తితోనే తాను కుటుంబాన్ని కలసి ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు. తన కుమార్తె వివాహ ఏర్పాట్లతో బిజీగా ఉన్నప్పటికీ, చిన్నారిని పరామర్శించి సహాయం చేయడం తన బాధ్యతగా భావించానని తెలిపారు. నిరంజన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయదలుచుకోలేదని, ఇది పూర్తిగా మానవతా దృక్పథంతో చేసిన సహాయమని బండ్ల గణేశ్ స్పష్టం చేశారు.



# 'మా ఇంటి బంగారం'తో సమంతకు ఘన విజయం

**బలగం టీవి, హైదరాబాద్**

నటి సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటించి, స్వయంగా నిర్మించిన లిలి'మా ఇంటి బంగారం'లిలి చిత్రం విడుదలైన తొలి రోజే మంచి వసూళ్లు సాధించినట్లు చిత్రబృందం ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా తొలి రోజు రూ.13.15 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు వెల్లడించారు. ఈ విజయంపై సమంత సోషల్‌మీడియా వేదికగా స్పందిస్తూ, ప్రేక్షకుల ఆదరణ తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో థియేటర్లకు రావడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

ఆమె మాట్లాడుతూ, ఒక సినిమాకు మంచి ఆరంభం రావడంలో యువత నుంచి పెద్దల వరకు అందరూ భాగస్వాములు కావడం ప్రత్యేక అనుభూతినిచ్చిందన్నారు. చాలాకాలంగా ఓపెనింగ్స్‌ను ప్రధానంగా పురుష ప్రేక్షకులే అందిస్తారనే అభిప్రాయం ఉన్నప్పటికీ, ఈ చిత్రానికి మహిళలు కూడా విశేషంగా ఆదరణ చూపడం సినీ ప్రేక్షకుల అభిరుచిలో వచ్చిన మార్పుకు నిదర్శనమని పేర్కొన్నారు. తమ చిన్న నిర్మాణ సంస్థకు ఈ విజయం ఎంతో ప్రోత్సాహాన్నిచ్చిందని చెప్పారు. ఇటీవల జరిగిన ప్రచార కార్యక్రమంలో సమంత మాట్లాడుతూ, ఈ చిత్రంలోని లిలిస్వర్ణలిలి పాత్ర తన వ్యక్తిత్వానికి చాలా దగ్గరగా ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు తాను చేసిన తెలుగు పాత్రల్లో ఇదే తనకు అత్యంత ఇష్టమైన పాత్ర అని వెల్లడించారు. యాక్షన్ సన్నివేశాల గురించి మాట్లాడుతూ, సినిమాలో అతిశయోక్తి బిల్డప్ లేదా స్లోమోషన్ దృశ్యాల కంటే సహజత్వానికే ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు. అన్ని యాక్షన్ సన్నివేశాలను తానే స్వయంగా చేశానని, చిత్రీకరణ సమయంలో గాయాలూ అయ్యాయని, అందువల్లే ఆ సన్నివేశాలు మరింత సహజంగా కనిపిస్తాయని సమంత తెలిపారు.

# కేసు ఉపసంహరించుకోలేదని హత్యాయత్నం..

**-నిందితుడి అరెస్ట్, రిమాండ్ కు తరలింపు..**

**బలగం టీవీ, గంభీరావుపేట :**

?తనపై నమోదైన చోరీ కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేసినా బాధితురాలు అంగీకరించకపోవడంతో, కక్ష పెంచుకొని బాధితురాలను హతమార్చేందుకు ప్రయత్నించిన నిందితుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ

గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన కందుకుల దస్తగిరి ,?గతంలో బాధితురాలు సుమలత ఇంట్లో చోరీకి యత్నించి జైలుకు వెళ్లినాడని, దస్తగిరి, బెయిల్‌పై బయటకు వచ్చాక సదరు కేసును ఉపసంహరించుకోవాలని బాధితురాలిని వేధించాడని తెలిపారు . ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున సుమలత ఇంట్లోకి కిటికీ గ్రిల్స్ కత్తిరించి చొరబడిన నిందితుడు, ఆమె గొంతు కోసేందుకు యత్నించిగా,బాధితురాలు కేకలు వేయడంతో పారిపోయాడని అన్నారు . బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టగా శుక్రవారం లింగన్నపేట శివారులో నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు . అతని వద్ద నుండి నేరానికి వాడిన హ్యాక్సా బ్లేడ్, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని,దస్తగిరిపై గతంలో పలు చోరీ కేసులు ఉన్నాయని తెలిపారు.

# 1990 నేపథ్యంలో 'కామ్రేడ్ కల్యాణ్'



**'ఒరియా పిల్ల' పాట విడుదల**

**బలగం టీవి, హైదరాబాద్**

హీరో శ్రీ విష్ణు కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'కామ్రేడ్ కల్యాణ్' చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వంలో వెంకటకృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్న ఈ చిత్రం 1992 నాటి ఆంధ్ర--ఒడిశా సరిహద్దు ప్రాంతాల నేపథ్యంలో రూపొందుతోంది.

చిత్రం నుంచి 'ఒరియా పిల్ల' పేరుతో తొలి గీతాన్ని శనివారం విడుదల చేశారు. కథానాయకుడు, కథానాయికల మధ్య సాగే ప్రేమకథను పరిచయం చేస్తూ ఈ గీతాన్ని రూపొందించారు. సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ స్వరపరిచిన ఈ పాట మధురమైన స్వరాలతో ఆకట్టుకుంటుండగా, భాస్కరభట్ల సాహిత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ సందర్భంగా హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ, 1990 దశకంలో జరిగిన కొన్ని యథార్థ సంఘటనలకు కల్పిత అంశాలను జోడించి కథను రూపొందించారని తెలిపారు. చిత్రంలో తాను కొత్త తరహా యాసలో మాట్లాడానని, ఆ ప్రత్యేకతను ప్రేక్షకులు తెరపై చూడాలని అన్నారు.

రచయిత, నిర్మాత కోన వెంకట్ మాట్లాడుతూ, ఈ చిత్రం శ్రీ విష్ణు కెరీర్‌లోనే అతిపెద్ద వినోదాత్మక చిత్రంగా నిలుస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు. సినిమాలోని నాలుగు పాటలు ఒక్కొక్కటి ప్రత్యేకంగా ఉంటాయని దర్శకుడు జానకిరామ్ మారెళ్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర బృంద సభ్యులు పాల్గొన్నారు. 'కామ్రేడ్ కల్యాణ్' చిత్రంపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి.


# ప్యారడైజ్‌లో మరో ప్రతినాయకుడి ఎంట్రీ

**విక్రమ్ మాలిక్‌గా రాఘవ్ జుయాల్ పాత్ర పరిచయం**

**బలగం టీవి, హైదరాబాద్**

నాని ప్రధాన పాత్రలో శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ప్యారడైజ్' చిత్రంపై రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే జడల్‌గా నాని, శికంజ మాలిక్‌గా మోహన్‌బాబు పాత్రలను పరిచయం చేసిన చిత్రబృందం తాజాగా మరో కీలక పాత్రను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది. బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయాల్ ఈ చిత్రంలో విక్రమ్ మాలిక్ అనే శక్తివంతమైన ప్రతినాయక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రత్యేక దృశ్యాన్ని విడుదల చేసింది. ఇందులో ఆయన పాత్ర అత్యంత హింసాత్మకంగా, ప్రభావవంతంగా కనిపిస్తోంది. మెడలో భారీ బంగారు గొలుసులు ధరించి, ప్రత్యేక లాకెట్‌ను తిప్పుతూ కనిపించే రాఘవ్ జుయాల్ రూపం ఆకట్టుకుంటోంది. నేపథ్య స్వరంలో ఇచ్చిన సంభాషణలు పాత్రకు మరింత బలాన్ని చేకూర్చాయి. దృశ్యం చివరలో జడల్ పాత్రలో నాని కనిపిస్తూ చెప్పిన సంభాషణ ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతోంది.

ఈ దృశ్యాలను పరిశీలిస్తే విక్రమ్ మాలిక్ పాత్ర శికంజ మాలిక్ కుటుంబానికి చెందినదిగా సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో జడల్, శికంజ మాలిక్‌ల మధ్య మాత్రమే కాకుండా విక్రమ్ మాలిక్‌తోనూ ప్రధాన ఘర్షణ ఉండనున్నట్లు తెలుస్తోంది. కాలానుగుణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ యాక్షన్ ప్రధాన చిత్రంలో నాని ఇప్పటివరకు కనిపించని మాస్ పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన గీతాలు, పాత్రల పరిచయ దృశ్యాలు చిత్రంపై భారీ అంచనాలు పెంచాయి. చిత్రంలో కథానాయికగా కయాదు లోహర్ నటిస్తుండగా, సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశకు చేరుకున్న ఈ సినిమాను అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందిస్తున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రతి సన్నివేశాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారని, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించడమే లక్ష్యంగా చిత్రబృందం పనిచేస్తోందని సమాచారం.






# పాత జ్ఞాపకాలను మర్చిపోవాలనుకుంటున్నా: శోభిత ధూళిపాళ

**జీవితంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన నటి**

**బలగం టీవి, హైదరాబాద్**

నటి శోభిత ధూళిపాళ ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ప్రశ్నకు ఆమె ఇచ్చిన సమాధానం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. అక్కినేని నాగచైతన్యతో వివాహం అనంతరం సినిమాలకు కొంత విరామం ఇచ్చిన శోభిత, ఇటీవల ఓ వెబ్ సిరీస్ ద్వారా ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం దర్శకుడు పా రంజిత్ రూపొందిస్తున్న విజ్ఞాన ప్రధాన కథా చిత్రం 'వెట్టువం' చిత్రీకరణలో ఆమె బిజీగా ఉన్నారు.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శోభితను, "మీ జీవితంలో ఏ విషయాన్ని పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నారు?" అని ప్రశ్నించగా, "నిన్నటి వరకు నా జీవితంలో జరిగిన ప్రతి సంఘటనను, జ్ఞాపకాన్ని పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నాను" అని సమాధానమిచ్చారు. తన వ్యాఖ్యలను వివరిస్తూ, మతిమరుపును చాలామంది లోపంగా భావించినప్పటికీ కొన్ని సందర్భాల్లో అది వరంగా మారుతుందని అన్నారు. జీవితంలో ఎదురైన బాధలు, మనసును గాయపరిచిన సంఘటనలు, చేదు జ్ఞాపకాలను మర్చిపోగలిగితేనే మనిషి ప్రశాంతంగా ముందుకు సాగగలడని పేర్కొన్నారు. గతాన్ని పట్టుకుని ఉండకుండా, భవిష్యత్తుపై సానుకూల దృక్పథంతో ముందుకు సాగడం అవసరమని శోభిత అభిప్రాయపడ్డారు. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం అభిమానులు, సినీ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

# మనసుకు విశ్రాంతి అవసరమే: కయాదు లోహర్

**బలగం టీవి, హైదరాబాద్**

నటి కయాదు లోహర్ సామాజిక మాధ్యమాలకు తాత్కాలికంగా విరామం ప్రకటించారు. శరీరానికి విశ్రాంతి ఎంత అవసరమో, మనసుకు కూడా అంతే అవసరమని పేర్కొంటూ కొంతకాలం సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండనున్నట్లు వెల్లడించారు.

తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా అభిమానులకు సందేశం ఇచ్చిన కయాదు, జీవితాన్ని మరింత ప్రశాంతంగా ఆస్వాదించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. స్క్రీన్‌కు అవతల ఉన్న నిజ జీవితంతో మమేకం కావడంతో పాటు తనతో తాను మరింత సమయం గడపాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. "కొన్నిసార్లు మనం శరీరానికి ఇచ్చే విశ్రాంతి మనసుకు కూడా అవసరం. కొంత నెమ్మదిగా సాగుతూ, కొద్దికాలం సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను" అని ఆమె తన సందేశంలో తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన అభిమానులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలుపుతూ, వారి ప్రేమాభిమానాలు తనకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. తాను విరామంలో ఉన్న సమయంలో ముఖ్యమైన సమాచారం ఉంటే తన బృందం ద్వారా అధికారిక ఖాతాలో పంచుకుంటామని వెల్లడించారు.

ఇటీవల తన సోదరుడి పుట్టినరోజు సందర్భంగా చేసిన భావోద్వేగ సందేశం కూడా అభిమానులను ఆకట్టుకుంది. కుటుంబ బంధాలకు తాను ఎంతో ప్రాధాన్యత ఇస్తానని ఆమె ఆ సందేశం ద్వారా తెలియజేశారు. ఇదిలా ఉండగా, ప్రస్తుతం కయాదు లోహర్ దర్శకుడు మరియప్పన్ చిన్న తెరకెక్కిస్తున్న భయానక కథా చిత్రంలో నటిస్తున్నారు. ప్రముఖ నటుడు, సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార చిత్రాలు ఇప్పటికే ప్రేక్షకుల ఆదరణ పొందాయి. ఈ చిత్రంలో పలువురు ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తుండగా, శామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ చివరి దశలో ఉన్నట్లు సినీ వర్గాలు తెలిపాయి.





# పాకిస్థాన్‌పై బంగ్లాదేశ్ సంచలన విజయం

**23 పరుగుల తేడాతో గెలుపు.. సెమీస్ ఆశలు సజీవం**

**బలగం టీవి, హైదరాబాద్**

మహిళల టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ జట్టు సంచలన విజయం నమోదు చేసింది. శనివారం జరిగిన గ్రూప్-1 మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై 23 పరుగుల తేడాతో గెలిచి సెమీఫైనల్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. మరోవైపు వరుసగా మూడో ఓటమిని చవిచూసిన పాకిస్థాన్ జట్టు సెమీస్ ఆశలను దాదాపుగా కోల్పోయింది.

మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. కెప్టెన్ నిగర్ సుల్తానా 36 పరుగులతో జట్టుకు అండగా నిలవగా, శోభన మొస్త్రరీ 22 పరుగులు చేసింది. చివరి ఓవర్లలో షోర్నా అక్తర్ దూకుడుగా ఆడి 22 బంతుల్లో ఐదు ఫోర్ల సాయంతో అజేయంగా 39 పరుగులు సాధించింది. పాకిస్థాన్ బౌలర్లలో ఫాతిమా సనా రెండు వికెట్లు పడగొట్టింది.

124 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్‌కు ఓపెనర్లు మునీబా అలీ, గుల్ ఫిరోజా మంచి ఆరంభాన్ని అందించారు. ఒక దశలో రెండు వికెట్ల నష్టానికి 64 పరుగులతో పటిష్ఠ స్థితిలో నిలిచిన పాకిస్థాన్, ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

బంగ్లాదేశ్ స్పిన్నర్లు నహిదా అక్తర్, సంజిదా అక్తర్ మేఘల అద్భుతంగా బౌలింగ్ చేశారు. ఇద్దరూ తలో మూడు వికెట్లు తీసి పాకిస్థాన్ మధ్య వరుసను కుప్పకూల్చారు. దీంతో పాకిస్థాన్ 20 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 100 పరుగులకే పరిమితమైంది. ఈ విజయంతో బంగ్లాదేశ్ జట్టు నాకౌట్ అవకాశాలను సజీవంగా ఉంచుకోగా, మూడు మ్యాచ్‌ల్లోనూ పరాజయం పాలైన పాకిస్థాన్ పాయింట్ల పట్టికలో చివరి స్థానానికి పడిపోయింది.

